ANDHRAJYOTHY
# ఆంధ్రజ్యోతి
5

విశాఖపట్నం
జిల్లా వార్తలు
సోమవారం 14 ఏప్రిల్ 2025

## పేలుడు ఘటనలో మృతులు

1. అప్పికొండ తాతబ్బాయి (50), కైలాసపట్నం, కోటవురట్ల మండలం, అనకాపల్లి జిల్లా
2. పురం పాప (40), చౌడువాడ, కోటవురట్ల మండలం, అనకాపల్లి జిల్లా
3. గుంపిన వేణు (40), చౌడువాడ, కోటవురట్ల మండలం, అనకాపల్లి జిల్లా
4. సేనాపతి బాబురావు(56), రాజుపేట, కోటవురట్ల మండలం, అనకాపల్లి జిల్లా
5. దాడి రామలక్ష్మి (38), రాజుపేట, కోటవురట్ల మండలం, అనకాపల్లి జిల్లా
6. సంగరాతి గోవింద (45), రాజుపేట, కోటవురట్ల మండలం, అనకాపల్లి జిల్లా
7. మెడిసి హేమంత్ (25), భీమిలి, విశాఖపట్నం జిల్లా
8. దేవర నిర్మల (38), సామర్లకోట, కాకినాడ జిల్లా

# పెను విషాదం

## కోటవురట్ల మండలం కైలాసపట్నం బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు

### ప్రమాదంలో క్షతగాత్రులు

- మడపాల జానకీరామ్ (బాణసంచా తయారీ కేంద్రం యజమాని), కైలాసపట్నం, కోటవురట్ల మండలం, అనకాపల్లి జిల్లా
- సియాద్రి గోవింద, కైలాస పట్నం, కోటవురట్ల మండలం, అనకాపల్లి జిల్లా
- సంగరాతి శ్రీను, కైలాస పట్నం, కోటవురట్ల మండలం, అనకాపల్లి జిల్లా
- గుంపిన సూరిబాబు, కైలాస పట్నం, కోటవురట్ల మండలం, అనకాపల్లి జిల్లా
- జల్లూరు నాగరాజు, రాట్నాల పాలెం కోటవురట్ల మండలం, అనకాపల్లి జిల్లా
- వేళంగి సంతోషి, సామర్లకోట, కాకినాడ జిల్లా
- వేళంగి షరోణి, సామర్లకోట, కాకినాడ జిల్లా
- వేళంగి రాజు, సామర్లకోట, కాకినాడ జిల్లా

### మృతులు
ఫైల్ ఫొటోలు


సేనాపతి బాబురావు


దాడి రామలక్ష్మి


సంగరాతి గోవింద


పురం పాప


వేణుబాబు


అప్పికొండ తాతబ్బాయి

### ఎనిమిది మంది కార్మికులు దుర్మరణం

**మరో ఎనిమిది మందికి తీవ్ర గాయాలు**

- నిర్వాహకుల నిర్లక్ష్యమే కారణం
- జిల్లాలో ఆరు బాణసంచా తయారీ కేంద్రాలకు మాత్రమే అనుమతి
- అనుమతి లేకుండానే నడుస్తున్నవి ఎన్నో...
- ప్రమాదాలు జరిగినప్పుడే అధికారుల హడావిడి


పేలుడు ధాటికి ఆనవాళ్లు లేని బాణసంచా తయారీ కేంద్రం

(అనకాపల్లి, కోటవురట్ల-ఆంధ్రజ్యోతి)

**బాణసంచా తయారీ కేంద్రాలు తరచూ కార్మికుల ప్రాణాలు బలిగొంటున్నాయి. అనుమతులు, సరైన భద్రతా చర్యలు లేకుండా నిర్వహించడం, అనుభవం లేని వారితో పనులు చేయించడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ క్రమంలో అనకాపల్లి జిల్లాలోని కోటవురట్ల మండలం కైలాస పట్నంలో ఆదివారం సంభవించిన అగ్ని ప్రమాదం ఎనిమిది నిండు ప్రాణాలను బలిగొనగా, మరో ఎనిమిది మందిని తీవ్రగాయాలకు గురిచేసింది. మండలంలోని కైలాసపట్నం శివారున ఉన్న విజయలక్ష్మి గణేష్ ఫైర్ వర్క్స్‌లో మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో భారీ పేలుళ్లు సంభవించడంతో కార్మికులు హాహాకారాలతో పరుగులు తీశారు. ఎగసిపడిన మంటలు, గ్రామాన్ని కమ్ముకున్న దట్టమైన పొగతో భీతిల్లిన జనం ఇళ్లలో నుంచి బయటకు పరుగులు తీశారు.**

అనుభవం లేని కార్మికులతో విజయలక్ష్మి గణేష్ ఫైర్ వర్క్స్‌లో బాణసంచా తయారు చేయించడమే ప్రమాదానికి కారణమని తెలిసింది. ఒక వివాహానికి తారాజువ్వలు, బాంబుల సరఫరాకు భారీగా ఆర్డరు తీసుకున్న నిర్వాహకుడు అనుభవం లేని వారితో వాటిని తయారు చేయిస్తుండగా, మందులు కలపడంలో జరిగిన పొరపాటు వల్లే ప్రమాదం జరిగి ఉంటుందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేసి, ప్రభుత్వానికి నివేదించారు. కాగా ఫైర్ వర్క్స్ యాజమాని నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమనే విమర్శలు ... మిగతా 6వ పేజీలో


మృతదేహం వద్ద విలపిస్తున్న యువతి


సంఘటన స్థలంలో క్షతగాత్రులు


మృతదేహాల వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు


కేజీహెచ్‌లో బాధితులను పరామర్శిస్తున్న హోం మంత్రి అనిత, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, కలెక్టర్ విజయకృష్ణన్

### విచారణకు ఆదేశం....

బాణసంచా ప్రమాద సంఘటనపై స్పందించిన ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్, పలువురు మంత్రులు జిల్లా అధికారులతో మాట్లాడారు. ఎనిమిది మంది మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని, సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

### వద్దన్న చోటే పనికి వెళ్లి..


హేమంత్ (ఫైల్)

భీమునిపట్నం/రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): బాణసంచా పేలుడు ఘటనలో భీమిలి మండలం రేఖవానిపాలెం పంచాయతీ మహాలక్ష్మీపురం గ్రామానికి చెందిన మెడిసి హేమంత్ (25) మృతి చెందడంతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. హేమంత్ తండ్రి శ్రీనివాసరావు ప్రైవేటు సెక్యూరిటీ గార్డు. తల్లి లలిత గతంలో మృతిచెందారు.కొంతకాలం కార్పెంటర్‌గా పనిచేసిన హేమంత్ ఆ తరువాత వెల్డింగ్ పనులకు వెళ్లేవాడు. అది కూడా గిట్టుబాటు కాక స్నేహితుల ద్వారా కోటవురట్ల మండలం కైలాసపట్నంలో బాణసంచా తయారీ కేంద్రంలో పనికి కుదిరాడు. అక్కడ ఖర్చులు పోను రోజుకి రూ.వెయ్యి ఇచ్చేవారు. అక్కడ పనికి వెళ్లవద్దని తండ్రి, అక్క స్వర్ణకళ వారించడంతో మానేశాడు. పది రోజుల క్రితం విజయవాడలో పని చూసుకుంటానని బయలుదేరాడు. అక్కడికి వెళ్లి ఉంటాడని తండ్రి, అక్క భావించారు. తీరా బాణసంచా పేలుడు ఘటనలో మృతిచెందాడని తెలిసి కన్నీరుమున్నీరయ్యారు. ఎంత వద్దన్నా...అదే పనిలో చేరి, మృతి చెందాడని గుండెలవిసేలా రోదిస్తున్నారు.

## కేజీహెచ్‌కు పేలుడు క్షతగాత్రులు

- ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో నలుగురు, ఆర్థో విభాగంలో ఒకరికి వైద్య సేవలు
- పరామర్శించిన హోం మంత్రి అనిత, ఎంపీ సీఎం రమేశ్

మహారాణిపేట(విశాఖ సిటీ), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నంలో బాణసంచా తయారీ కేంద్రంలో ఆదివారం జరిగిన పేలుడు ప్రమాదంలో తీవ్రంగా గాయ పడిన ఐదుగురిని విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు తీసుకువచ్చారు. వీరికి ప్లాస్టిక్ సర్జరీ, ఆర్థోపెడిక్ విభాగంలో మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో క్షతగాత్రులు ఇక్కడికి తీసుకువచ్చారు. ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో చికిత్స పొందుతున్న వారిలో జల్లూరి నాగరాజు (50), మడగల జానకీరామ్ (45), సియాదుల గోవింద్ (45), వేళంగి శర్వాణి ఉన్నారు. వీరిలో నాగరాజుకు 90 శాతం మేర శరీరం కాలిపోవడంతో పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలిసింది. జానకీరామ్ శరీరం కూడా 50 శాతం మేర కాలిపోయిందని చెబుతున్నారు. గోవింద్‌కు 30 శాతం మేర శరీరంపై కాలిన గాయాలున్నాయి. అలాగే, రెండు కాళ్లకు గాయాలున్నట్టు వైద్యులు గుర్తించారు. వేళంగిని శర్వాణి ఎడమ చేతితోపాటు మరికొన్ని భాగాల్లో చిన్న గాయాలు ఉన్నట్టు గుర్తించారు. వేళంగి సంతోషికి కాలు విరగడంతోపాటు కుడి చేయి, తలకు గాయాలయ్యాయి. ఈమెకు ఆర్థో విభాగంలో వైద్యం అందిస్తున్నారు. కాగా కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న పేలుడు బాధితులను హోం మంత్రి వంగలపూడి అనిత, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, కలెక్టర్లు విజయకృష్ణన్, హరేంధిర ప్రసాద్ ఆదివారం రాత్రి పరామర్శించారు. అందరికీ మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.



కేజీహెచ్‌కు తీసుకువచ్చిన క్షతగాత్రులు మడగల జానకీరామ్, జల్లూరి నాగరాజు

## ఎఫ్ఆర్ఎస్‌కు మస్కా



- ఆరోగ్యశాఖ సిబ్బంది హాజరు ట్యాంపరింగ్
- విధులకు డుమ్మా కొట్టిన వైద్యులు, సిబ్బంది
- గుర్తించిన ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు
- షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశం

విశాఖపట్నం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వశాఖల్లో పనిచేసే సిబ్బంది సమయపాలన పాటించేలా అమలుచేసిన ఫేషియల్ రికగ్నిషన్ బేస్డ్ అటెండెన్స్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్)కు ఆరోగ్యశాఖలో పని చేసే వైద్యులు, సిబ్బంది మస్కా కొట్టారు. హాజరు విధానాన్ని ట్యాంపరింగ్ చేసి జిల్లాలోని కొందరు వైద్యులు, సిబ్బంది విధులకు డుమ్మా కొట్టినట్టు గుర్తించింది. విధులకు సకాలంలో హాజరుకాకుండా ఉండేందుకు, వ్యక్తిగత పనులపై బయటకు వెళ్లినప్పుడు సాంకేతికతను వినియోగించి ఎఫ్ఆర్ఎస్ వేసినట్టు గుర్తించారు. ఇందుకు అత్యాధునిక ఫోన్లు, కొన్ని యాప్‌లు వినియోగించినట్టు తేల్చింది. ముఖ ఆధారిత హాజరు విధానంలో మోసానికి పాల్పడినట్టు గుర్తించిన వారిలో ముగ్గురు వైద్యులతోపాటు ఆరుగురు సిబ్బంది ఉన్నారు. వీరిలో మధురవాడ పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ డి.సాయికిరణ్, కేజీహెచ్‌లోని టెలీహబ్ విభాగంలో పనిచేసే ... మిగతా 6వ పేజీలో

## ఆక్రమణలకు మార్కింగ్!

**పూర్ణామార్కెట్ రోడ్డులో మళ్లీ దుకాణాల ఏర్పాటుకు రంగం సిద్ధం**

- ప్రజా ప్రతినిధుల చుట్టూ కాంట్రాక్టరు ప్రదక్షిణ
- నేతల సిఫారసుకు సీపీ ససేమిరా
- అయినా రోడ్డుపై మార్కింగ్ చేసిన సిబ్బంది
- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న వ్యాపారులు

విశాఖపట్నం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పూర్ణామార్కెట్ రోడ్డులో మళ్లీ చిల్లర దుకాణాల ఏర్పాటుకు అధికారులు చర్యలు ప్రారంభించారు. ప్రధాన రహదారిని ఆక్రమించి దుకాణాల ఏర్పాటుతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తడంతో పాటు పార్కింగ్‌కు స్థలం లేక అవస్థలు ఎదురవుతున్న వైనంపై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. వీటిపై స్పందించిన నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి స్వయంగా పూర్ణామార్కెట్‌ను సందర్శించి, దుకాణాల తొలగింపునకు ఆదేశాలిచ్చారు.

దీంతో పోలీసులు మార్కెట్ ప్రధాన రహదారితోపాటు పరిసరాల్లో రోడ్లపై ఆక్రమిత దుకాణాలను తొలగించారు. మార్కెట్‌లో ఆశీలు టెండర్ దక్కించుకున్న వ్యక్తి అధిక లాభాలు ఆర్జించేందుకు వీలుగా రోడ్డుపై చిరు దుకాణాల ఏర్పాటుకు అనుమతించేలా చూడాలంటూ కూటమి ప్రజా ప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. దీంతో వారంతా ... మిగతా 6వ పేజీలో


పూర్ణామార్కెట్ రోడ్డులో దుకాణాలు ఏర్పాటుకు మార్కింగ్ వేసిన దృశ్యం

## ఆరు గంటలు ఉత్కంఠ!

- సుజాతనగర్‌లో తప్పిపోయిన పసి పాప
- డ్రోన్ సహాయంతో గుర్తించిన పోలీసులు
- పెందుర్తి సీఐ చొరవతో తల్లిదండ్రుల చెంతకు చిన్నారి


రుగ్వేశ్వరిశ్రీ

పెందుర్తి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): అక్కతో పాటు ఆడుకుంటున్న చిన్నారి కనిపించకుండా పోయింది. తల్లిదండ్రులు గాలించినా ఫలితం కనిపించలేదు. పోలీసులకు సమాచారం అందడంతో వారు రంగంలోకి దిగి డ్రోన్ సాయంతో గుర్తించి, తల్లిదండ్రులకు చిన్నారిని అప్పగించడంతో కథ సుఖాంతమయింది. సుమారు ఆరుగంటలు తీవ్ర ఉత్కంఠకు గురిచేసిన ఈ సంఘటన శనివారం రాత్రి జరిగింది. సుజాతనగర్ 80 అడుగుల రోడ్డులోని సాయిసుధానగర్ అపార్ట్‌మెంట్‌లో కేశవరావు, మాధవి దంపతులు నివాసముంటున్నారు. వీరికి దక్షశ్రీ (6), రుగేశ్వరిశ్రీ(2) చిన్నారులున్నారు. కేశవరావు క్రేన్ ఆపరేటర్, మాధవి సచివాలయ ఉద్యోగి. ఈ క్రమంలో శనివారం సాయంత్రం ... మిగతా 6వ పేజీలో

## కూటమి నేతల కసరత్తు

- మేయర్‌పై అవిశ్వాస తీర్మానం నెగ్గేలా వ్యూహం

విశాఖపట్నం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): నగర మేయరు గొలగాని హరివెంకటకుమారిపై ఈ నెల 19వ తేదీన ప్రవేశపెట్టనున్న అవిశ్వాస తీర్మానం నెగ్గేందుకు తగిన వ్యూహాలపై కూటమి నేతలు ఆదివారం దసపల్లా హోటల్‌లో సమావేశమయ్యారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మేయరుపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు అవసరమైన బలం సమకూర్చుకున్నామని వెల్లడించారు. ఈనెల 19న అవిశ్వాస తీర్మానం పెట్టే రోజున కార్పొరేటర్లకు తగిన సూచనలు ఇవ్వాలని తీర్మానించారు. సమావేశంలో ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, పి.గణబాబు, పి.విష్ణుకుమార్‌రాజు, పంచకర్ల రమేష్‌బాబు, సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.ప్రణవ్‌గోపాల్, జీవీఎంసీలో టీడీపీ ఫ్లోర్‌లీడరు పీలా శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


దసపల్లా హోటల్‌లో సమావేశమైన కూటమి నేతలు

## సరియా జలపాతంలో ఇద్దరి గల్లంతు

- పూర్ణామార్కెట్ ప్రాంత వాసులుగా గుర్తింపు

అనంతగిరి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పర్యాటక కేంద్రం సరియా జలపాతం వద్ద ఇద్దరు యువకులు గల్లంతయ్యారు. పూర్ణామార్కెట్‌కి చెందిన ఆరుగురు యువకులు ఆదివారం సరియా జలపాతం వద్దకు వెళ్లారు. రెండో స్టెప్ అందాలను తిలకించి వెళుతుండగా.. మొదటి స్టెప్ వద్దకు వచ్చేసరికి వాసు (23), నరసింహ(23) జారిపడి గల్లంతయ్యారు. స్థానికులు అనంతగిరి పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయాన్ని వారి కుటుంబ సభ్యులకు తెలిపారు. సోమవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టనున్నారు.

### రాజ్యాంగ పరిరక్షణకు ఐక్య పోరాటం



రాజ్యాంగ పరిరక్షణకు ఐక్యంగా పోరాడాలని సినీనటుడు ఆర్.నారాయణమూర్తి పిలుపునిచ్చారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ 134వ జయంతి సందర్భంగా ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన రాజ్యాంగ పరిరక్షణ సమ్మేళనంలో పాల్గొన్నారు. - వివరాలు 6లో


వినోదంలో ఆలయ అధికారులు


దొరికిన ఉంగరాన్ని చూపుతున్న అర్చకులు


శ్రీపుష్పయాగంలో స్వామివారు

# అప్పన్న ఉంగరం దొరికింది

- ఈఓ నుంచి భక్తుల వరకూ అందరూ అనుమానితులే
- ఎట్టకేలకు ఏడవ ముసుగులో దొరికిన అంగుళీయకం
- వైభవంగా స్వామివారి వినోదోత్సవం

సింహాచలం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న స్వామి వార్షిక తిరు కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం వినోదోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఆలయంలో భక్తుల ఆందోళనలు, ఆనందోత్సాహాల నడుమ ఈ వేడుక ఆసక్తికరంగా సాగింది. ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామివారు తన దేవేరులతో, మంది మార్బలంతో కలిసి అడవికి వేటకు వెళ్లగా నీలుడు అనే చోరుడు దారి కాచి ఆ మార్గం గుండా వెళ్లే వారిని దోచుకునే క్రమంలో స్వామివారి ఉంగరాన్ని కూడా అపహరిస్తాడు.ఈ ఉదంతాన్ని ఆలయ అర్చకులు వేడుకగా నిర్వహించిన విషయం తెలిసిందే. ఉంగరం దొరికిన ఘట్టాన్ని ఆదివారం వినోదోత్సవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపిన అనంతరం ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని స్వర్ణాభరణాలతో కాలుపై కాలు వేసుకుని ఠీవిగా కూర్చున్న రాజుగా అలంకరించి అతనిపై ఏడు ముసుగులు వేశారు. తొలుత ఆలయ బేడా మండపంలో తిరువీధి జరిపారు. ప్రధాన రాజగోపురం వద్ద స్వామివారిని ఉంచి పురోహితులు కరి సీతారామాచార్యులు దొంగలను వెతికే పనిలో పడ్డారు. ఈ క్రమంలో తొలుత ఆలయ దిగువ శ్రేణి ఉద్యోగులకు అధికారి కొత్వాల్ నాయకుడు లంక సూరిబాబు, వైదిక సిబ్బంది ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్‌ను, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఐవీ రమణాచార్యులు, అనుమానితులుగా పట్టుకుని విచారించి తొలి ముసుగు తొలగించారు. తరువాత దేవస్థానం ఈఓ సుబ్బారావును, ఏఈఓ ఆనందకుమార్, పర్యవేక్షణాధికారి ప్రసాద్, కొందరు యువతను, విద్యార్థులను అనుమానితులుగా పట్టుకున్నారు. వారిని స్థానాచార్యులు రాజగోపాల్ న్యాయమూర్తిగా వ్యవహరించి విచారించారు. వారిలో అనపర్తి సమీప మామిడాడ గ్రామానికి చెందిన గాయత్రి విద్యా పరిషత్‌లో తృతీయ సంవత్సరం ఎంబీబీఎస్ విద్యార్థినులు, కొత్తవలస ప్రాంతానికి చెందిన శ్రావణి, భార్గవి, యోగిత విషయం తెలియక కన్నీటిపర్యంతమయ్యారు. వడ్డాది ప్రాంతానికి చెందిన వ్యక్తి అధికారులను తీవ్రస్థాయిలో ప్రతిఘటించి వాగ్వివాదానికి దిగాడు. చివరకు అనుమానితులుగా పట్టుబడిన అందరూ ఇది ఉత్సవంలో భాగమని తెలుసుకుని ఆనందం వ్యక్తం చేశారు. ఏడవ ముసుగును తొలగించగా పోయిన ఉంగరం దొరికిందని అర్చక స్వామి చూపడంతో అంతా ఆనందించారు.

### శ్రీ పుష్పయాగంతో ముగిసిన ఉత్సవాలు

ఈనెల 7 నుంచి ప్రారంభమైన కల్యాణ మహోత్సవాలు ఆదివారం రాత్రి జరిగిన శ్రీ పుష్పయాగంతో పూర్తయ్యాయి.సాయంత్రం 6 గంటలకు దర్శనాలు నిలిపివేసి, రాత్రి ఆరాధన జరిపారు.అనంతరం ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని, శ్రీదేవి, భూదేవి సమేతంగా స్వర్ణాభరణాలతో పలు రకాల పుష్ప మాలికలతో శోభాయమానంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలో శేషపాన్పు వాహనంపై అధిష్టింపజేశారు. స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో ప్రధానార్చకులు శ్రీనివాసాచార్యులు, రమణాచార్యులు, సీతారామాచార్యులు తొలుత పూజలు జరిపి అనంతరం 12 రకాల పుష్పాలతో స్వామివారు, అమ్మవార్లకు అర్చనలు చేశారు. దీంతో వారం రోజుల పాటు జరిగిన వార్షిక తిరు కల్యాణ మహోత్సవాలు ముగిసాయి.

## చందనోత్సవం ముఖ్య అధికారిగా మూర్తి

సింహాచలం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై ఈనెల 30న జరిగే వరాహలక్ష్మీనృసింహస్వామి నిజరూప దర్శనం చందనోత్సవం నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య అధికారిగా దేవదాయశాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ ఎన్‌వీఎస్ఎన్ మూర్తిని నియమిస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల మొదటి వారంలో ఉత్సవ ముఖ్య అధికారిగా ఆర్‌జేసీ భ్రమరాంబను నియమించారు. వ్యక్తిగత కారణాల వల్ల ఆమె ఆ బాధ్యతల నుంచి తనను తప్పించాలని ప్రభుత్వాన్ని లిఖిత పూర్వకంగా కోరడంతో దేవదాయ శాఖ కమిషనర్ కొడూరి రామచంద్రమోహన్ తాజాగా ఆదేశాలిచ్చారు. చందనోత్సవానికి ముఖ్య అధికారిని నియమించడం ఏటా ఆనవాయితీ. కానీ గతంలో ఎవరూ సీఎఫ్ఓ బాధ్యతల నుంచి తప్పించాలని కోరిన దాఖలాలు లేదు. తాజా పరిణామాలపై దేవదాయ శాఖలో చర్చ సాగుతోంది.

## నేడు పీజీఆర్ఎస్ రద్దు

విశాఖపట్నం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా సెలవు కావడంతో సోమవారం జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్టు పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వచ్చే సోమవారం ప్రజల నుంచి యథావిధిగా ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. జీవీఎంసీలో జరిగే పీజీఆర్ఎస్‌ను కూడా రద్దు చేస్తున్నట్టు జీవీఎంసీ అదనపు కమిషనర్ రమణమూర్తి చెప్పారు.


ర్యాలీలో పాల్గొన్న సినీ నటుడు ఆర్. నారాయణమూర్తి, తదితరులు

## రాజ్యాంగ పరిరక్షణకు ఐక్యంగా పోరాడాలి

**సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి**

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ పరిరక్షణకు ఐక్యంగా పోరాడాలని సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి పిలుపునిచ్చారు. ఆదివారం కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం, ప్రజానాట్యమండలి విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డా.బి.ఆర్.అంబేడ్కర్ 134వ జయంతి సందర్భంగా డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో రాజ్యాంగ పరిరక్షణ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై అంబేడ్కర్, జ్యోతిరావుపూలే, హష్మీ, బాబు జగ్జీవన్‌రామ్‌ల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు బలహీనవర్గాల తరఫున పోరాడే గొప్ప వ్యక్తుల నుంచి పోరాట స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలన్నారు.సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు లోకనాథం మాట్లాడుతూ దళితులు, మైనార్టీలు. కవులు, కళాకారులపై కేంద్రం దాడులు చేయిస్తోందన్నారు. కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్రా మాల్యాద్రి, పీఎన్ఎం జిల్లా అధ్యక్షుడు జి.రమణ, జిల్లా కార్యదర్శి టి.చిరంజీవి తదితరులు మాట్లాడారు. ఈ సభలో పీఎన్ఎం జిల్లా కార్యదర్శి ఎం.చంటి, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు. తొలుత నిర్వహించిన ర్యాలీలో రాజ్యాంగ పరిరక్షణ నాటిక.. బాల బాలికల నృత్య ప్రదర్శనలు అలరించాయి.

## చిట్టివలసలో దేవాలయాల నిర్మాణానికి శంకుస్థాపన

తగరపువలస, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జూట్‌మిల్లు రామాలయాన్ని ఆనుకుని ఉన్న స్థలంలో ఎనిమిది దేవాలయాల నిర్మాణానికి ఆదివారం భూమి పూజ చేశారు. రామాలయం అర్చకుడు ఆకెళ్ల కుటుంబీకులు వీటి నిర్మాణానికి సంకల్పించారు. విఘ్నేశ్వర, అయ్యప్ప, రామాలయం, ఆంజనేయస్వామి వంటి ఎనిమిది మంది దేవుళ్ల ఆలయాలను ఇక్కడ నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు ఆకెళ్ల భాగ్యరాజు, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

## వెండి పాత్రలు బహూకరణ

సింహాచలం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి నిత్యం జరిగే పూజల్లో వినియోగించాలని కోరుతూ నగరంలోని సీతమ్మధార ప్రాంతానికి చెందిన ఆచంట నాగభూషణరావు సుమారు రూ. లక్ష విలువ చేసే కిలో తూనిక కలిగిన నాలుగు రజిత తీర్థ పాత్రలను బహూకరించారు. దేవస్థానం ఈఓ కొమ్ముల సుబ్బారావుకు ఆదివారం ఆయన వీటిని అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అధికారులు స్వామివారి అంతరాలయ దర్శనం కల్పించి, శేషవస్త్రాలు, వేదాశీర్వచనాలు, ప్రసాదాలను అందజేశారు.

## వ్యక్తికి గుండె నొప్పి... కాపాడిన మెరైన్ పోలీసులు

సాగర్‌నగర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ బీచ్‌లో ఆదివారం సముద్ర స్నానం చేస్తూ ఓ వ్యక్తి గుండెనొప్పికి గురయ్యాడు. వెంటనే అక్కడ ఉన్న మెరైన్ పోలీసులు సకాలంలో ఆస్పత్రికి తరలించి, అతని ప్రాణాలు కాపాడారు. పశ్చిమ బెంగాళ్ రాష్ట్రానికి చెందిన కుటుంబం రుషికొండ బీచ్‌కు విహారానికి వచ్చారు. వారు బీచ్‌లో స్నానాలు చేస్తుండగా ఎస్‌కే హఫిజుల్ రెహమాన్ (67) గుండెనొప్పికి గురయ్యాడు. కెరటాల్లో ఆయనతో పాటు వున్న వారు గట్టిగా కేకలు వేయడంతో సమీపంలో ఉన్న మెరైన్ పోలీసులు వీల్ చైర్ సహాయంతో అతడ్ని ఒడ్డుకు తీసుకువచ్చి 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్టు తెలిసింది. మెరైన్ పోలీసులను సీఐ శ్రీనివాస్ అభినందించారు.

## సింహగిరిపై విదేశీయులు



సింహాచలం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామిని ఆదివారం మధ్యాహ్నం బ్రెజిల్ దేశానికి చెందిన పర్యాటకులు దర్శించుకున్నారు. పర్యాటక శాఖ వాహనంలో కొండకి వచ్చిన వారు శ్రీఘ్రదర్శనం టికెట్లు తీసుకుని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం మాడవీధుల్లో భక్తులతో కలిసి సెల్ఫీలు తీసుకున్నారు.

## బడుగుల ఆశాజ్యోతి అంబేడ్కర్


అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సీఐ తిరుమలరావు

భీమునిపట్నం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : దేశంలో కుల, మతాలకు అతీతంగా చక్కటి రాజ్యాంగాన్ని రూపొందించిన గొప్ప మేధావి డా. బీఆర్ అంబేడ్కర్ అని సీఐ బి. తిరుమలరావు అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ కాలనీలో దళిత నాయకుడు భాగం గోపాలరావు ఆధ్వర్యంలో ఆదివారం అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం వల్లే దేశంలో చట్టాలు ప్రతిష్టాత్మకంగా అమలవుతున్నాయని చెప్పారు. అనంతరం అంబేడ్కర్ వాది గోడి నాగేశ్వరరావు, భువనేశ్వరి, కొప్పల రమేశ్ ఆర్థిక సహాయంతో వంద మంది పారిశుధ్య కార్మికులకు, దళిత మహిళలకు చీరలు పంపిణీ చేశారు. తొలుత పలువురు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు కొప్పల రమేశ్, గంటా నూకరాజు, పరిమి భువనేశ్వరి, గోడి సుజాతకుమారి, బుద్ధిస్ట్ కొత్తపల్లి వెంకటరమణ, ఎం. రఘురాంరెడ్డి, ఎస్. కరుణాకర్‌రెడ్డి, అల్లిపిల్లి నరసింగరావు, వాసుపల్లి కొండబాబు, కొప్పల కృష్ణ, కనకమహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## 9 నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు


ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

భీమునిపట్నం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఐశ్వర్య వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మే 9 నుంచి 14వ తేదీ వరకూ నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం వారు ఆలయ ఆవరణలో ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు కలిగొట్ల సూర్యనారాయణమూర్తి, శ్రీరామచంద్రమూర్తి, కేవీ భానోజీరావు, కె. శ్రీనివాసరావు, కోశాధికారి వుశిరికల బంగార్రాజు, హరినాథరెడ్డి పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు భీమిలి విద్యార్థులు

భీమునిపట్నం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ది సన్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల కరస్పాండెంట్ కె. శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 7న నగరంలో జరిగిన ఎంపిక పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారన్నారు. ఈమేరకు ఈనెల 14, 15 తేదీల్లో అనంతపురం జిల్లాలోని డీటీసీ పోలీస్ మైదానంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో క్రీడాకారులు పాల్గొనున్నట్టు ఆయన చెప్పారు.

## శబరిమలైలో భీమిలి భక్తులకు వసతి గృహాలు

భీమునిపట్నం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : భీమిలి నుంచి వెళ్లే భక్తులకు శబరిమలైలో రెండు వసతి గృహాల నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని స్థానిక వీరాంజనేయ అయ్యప్పస్వామి సేవా సంఘం సభ్యులు అక్కడి ట్రావెన్ కోర్ దేవస్వమ్ బోర్డును కోరారు. ఈమేరకు ఆదివారం వారు శబరిమలైలో బోర్డు సభ్యులకు వినతి పత్రం అందజేశారు. వీరాంజనేయ అయ్యప్పస్వామి సేవా సంఘానికి, భీమిలి తీరంలో అయ్యప్ప ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త బి. బాలసుబ్రహ్మణ్యం పేరుతో వసతి గృహాల ఏర్పాటుకు అనుమతి కోరామన్నారు.

## కొమ్మాదిలో మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

కొమ్మాది, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : కొమ్మాది గ్రామానికి చెందిన వ్యక్తి శివారు ప్రాంతంలో మృతి చెందాడు. పీఎంపాలెం సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం.. కొమ్మాది గ్రామానికి చెందిన చుక్కల తాతబాబు (60) గతంలో రోడ్డు ప్రమాదానికి గురికావడంతో మతి స్థిమితం కోల్పోయాడు. దీంతో గత జనవరి నెలలో ఒకసారి ఇంట్లో నుంచి వెళ్లిపోవడంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి వెతికి పట్టుకుని వారికి అప్పగించారు. ఇటీవల మళ్లీ ఇంట్లో నుంచి వెళ్లిపోవడంతో కుటుంబీకులు అతన్ని వెతికే పనిలో ఉన్నారు. ఈలోగా ఆదివారం కొంతమంది యువకులు క్రికెట్ ఆడుకోవడానికి కొమ్మాది శివారు ప్రాంతానికి వెళ్లగా అక్కడ విపరీతమైన దుర్వాసన రావడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, తాతబాబు కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. వారు తాతబాబుగా గుర్తించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ చెప్పారు. కాగా మృతికి గల కారణాలు తెలియలేదని ఆయన తెలిపారు.


భీమిలి పట్టణంలో ఏబీ చర్చి ఆధ్వర్యంలో ఊరేగింపు

## భక్తిశ్రద్ధలతో మట్టల పండగ

భీమునిపట్నం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆంధ్రా బాప్టిస్ట్ చర్చి సభ్యులు మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆ సంఘం అధ్యక్షుడు సుధాకర్ ఆధ్వర్యంలో సభ్యులు యేసు కీర్తనలు ఆలపిస్తూ... ఈత మట్టలను పూలతో అందంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగింపు జరిపారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ క్రీస్తుకు శిలువ వేయడానికి ముందు వచ్చే శుభ శుక్రవారం ముందు మట్టల ఆదివారం పండగ చేయడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పీఎస్ చంద్, ఆల్బర్ట్ సుదర్శన్, విలియంకేసీ, స్టీవెన్, ఎస్. మోహన్‌కుమార్, విజయమ్మ రోనాల్డ్, తదితరులు పాల్గొన్నారు.

**సాగర్‌నగర్ :** సాగర్‌నగర్ పరిసర ప్రాంతాల్లోనూ మట్టల ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. క్యుఎంబీ చర్చి పాస్టర్ ఎం. డానియల్ వరప్రసాద్ నేతృత్వంలో క్రైస్తవులు మట్టలు చేత పట్టుకుని దేవుడి పాటలు ఆలపిస్తూ వీధుల్లో ర్యాలీ చేశారు.

## కరాటే క్రీడాకారులకు బెల్ట్‌లు

భీమునిపట్నం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని షాడో షాటోకాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన వారికి నిర్వాహకులు ఆదివారం బెల్ట్‌లు అందజేశారు. ఆదర్శ పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 50 మందిలో 15 మందికి ఎల్లో, 15 మందికి ఆరెంజ్, 20 మందికి గ్రీన్, 5 మందికి బ్రౌన్ బెల్టులు, ఇద్దరికి పర్సనల్ బెల్టులు, ఇద్దరికి బ్లూ బెల్టులు, ఒక్కరికి బ్లాక్ బెల్టు అందజేశారు.

# ఆక్రమణలకు మార్కింగ్!

... 5వ పేజీ తరువాయి

సీపీని సంప్రతించి ట్రాఫిక్‌కు ఇబ్బందిలేకుండా దుకాణాల ఏర్పాటుకు అనుమతించాలని కోరినట్టు తెలిసింది. దీనికి సీపీ ససేమిరా అనడంతో జోనల్ కమిషనర్, కిందిస్థాయి పోలీసు అధికారులకు ఫోన్‌చేసి దుకాణాల ఏర్పాటుకు మార్కింగ్ చేయాలని, లేదంటే దగ్గరుండి దుకాణాలు పెట్టిస్తామని బెదిరించినట్టు ప్రచారం జరుగుతోంది. దీంతో పోలీసులు పూర్ణామార్కెట్ రోడ్డులో పార్కింగ్ వెంబడి దుకాణాలు పెట్టుకునేందుకు వీలుగా మార్కింగ్ చేశారు. ఈ నేపథ్యంలో మార్కెట్‌లోని వ్యాపారులతో పాటు స్థానిక కార్పొరేటర్ అడ్డుకున్నారు. మార్కెట్‌లోపల ఉన్న వందలాది వ్యాపారులకు ఇబ్బందులు ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆశీలు కాంట్రాక్టరు రోడ్డుపై దుకాణాలు పెట్టించి, రోజుకు రూ.300 చొప్పున వసూలు చేసుకోవాలనే ప్రజాప్రతినిధులను తప్పుదారిపట్టిస్తున్నారని ఆరోపించారు. రోడ్డుపై దుకాణాలు పెట్టాలనుకునే వారికి మార్కెట్‌లో దుకాణాలున్నాయని, అక్కడ వద్దనుకుంటే జీవీఎంసీకి అప్పగించాలన్నారు. వేరొకరికి కేటాయిస్తారని చెప్పడంతో అధికారులు వెనుదిరిగారు. దీనిపై సీపీతోపాటు జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ హరేంధిరప్రసాద్ దృష్టిసారించాలని, రోడ్డుపై ఆక్రమణలకు అవకాశం లేకుండా ఆదేశాలివ్వాలని కోరుతున్నారు.

### వసూళ్లకు వ్యూహం

తొలగించిన దుకాణాలను తిరిగి పెట్టించడానికి చాలా ఖర్చుచేశామని, మార్కెట్‌లో దందా చేస్తున్న ఓ దళారీ వసూళ్లకు రంగం సిద్ధం చేసినట్టు తెలిసింది. పూర్ణామార్కెట్ ప్రధాన రహదారిలో దుకాణాలను పోలీసులు రెండు నెలల కిందట తొలగించగా, ఆశీలు వసూలు కాంట్రాక్ట్ దక్కించుకున్న వ్యక్తి ఈనెల ఒకటిన తిరిగి పెట్టించారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో మరోసారి కథనం ప్రచురితంకావడంతో రెండోతేదీన పోలీసులు దుకాణాలను తొలగించారు. ఈ క్రమంలో కూటమి నేతల పేరుతో జీవీఎంసీ, పోలీసుల వద్ద రుబాబు చేసి, దుకాణాలు పెట్టించేందుకు మార్కింగ్ చేయించారు. ఈ మేరకు ఆదివారం 130 మంది వ్యాపారులతో రామకృష్ణ రైతుబజార్‌లో సమావేశం నిర్వహించారు. సోమవారం నుంచి మార్కెట్ రోడ్డులో దుకాణాలను పెట్టిస్తానని, జీవీఎంసీ, పోలీసు అధికారులకు భారీగా ముట్టజెప్పాల్సి ఉంటుందని, ఆ వివరాలను చెబితే లీకై, 'ఆంధ్రజ్యోతి'లో వార్తలు వచ్చేస్తున్నాయి కాబట్టి, పదిరోజుల తర్వాత చెబుతానన్నాడని సమాచారం. ఇదంతా పోలీసులు, జీవీఎంసీ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని వ్యాపారులు ఆరోపిస్తున్నారు.

# ఎఫ్‌ఆర్ఎస్‌కు మస్కా

... 5వ పేజీ తరువాయి

డాక్టర్ కోటకల అనూష, చినవాల్తేరు పట్టణ ఆరోగ్య కేంద్రంలో పనిచేసే డాక్టర్ సాయి మోహిని ఉన్నారు. వీరితోపాటు పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో కొందరు సిబ్బంది ముఖ ఆధారిత హాజరులో మోసానికి పాల్పడినట్టు ప్రభుత్వం గుర్తించింది. వీరిలో నగర పరిధి అంబేడ్కర్ కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రంలో పనిచేసే ఎస్‌వీఎల్ ప్రవీణ, మధురవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసే పసుపుల దీపిక, కొమ్మాది పట్టణ ఆరోగ్య కేంద్రంలో పనిచేసే గోసాల సాల్మన్‌రాజు, ఎంఎస్ఆర్ లేఅవుట్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో పనిచేసే డి.సాహిత్య, ఆర్పీపేట పట్టణ ఆరోగ్య కేంద్రంలో పనిచేసే మాట్టాశశి ప్రియాంక, రామ్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో పనిచేసే ఉయ్యాల కార్తీక్ ఉన్నట్టు గుర్తించింది. ఈ జాబితాను జిల్లా ఆరోగ్యశాఖ అధికారులకు పంపింది. దీంతో వీరిపై శాఖాపరమైన చర్యలు తీసుకునేందుకు యంత్రాంగం సిద్ధమవుతోంది. తొలుత వీరికి షోకాజ్ నోటీసులు జారీ చేసి, వివరణ తీసుకోవాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందినట్టు తెలిసింది. అనంతరం చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. ఎఫ్‌ఆర్ఎస్‌ను ఎలా ట్యాంపరింగ్ చేశారు, ఎందుకు చేశారన్న దానిపై వివరణ తీసుకుంటామన్నారు.

### రాష్ట్ర స్థాయిలో మానిటరింగ్

ప్రభుత్వశాఖల్లో అమలుచేస్తున్న ఎఫ్‌ఆర్ఎస్ విధానాన్ని రాష్ట్రస్థాయి నుంచే మానిటరింగ్ చేస్తున్నారు. అక్కడి నుంచే పర్యవేక్షిస్తున్న అధికారులు ఉద్యోగుల సమయ పాలనను అంచనా వేస్తున్నారు. గత కొన్నాళ్లుగా భిన్నమైన పద్ధతులను అనుసరిస్తూ హాజరు వేస్తున్న సిబ్బందిని గుర్తించిన ప్రభుత్వం, జాబితాను జిల్లా యంత్రాంగానికి పంపింది. అన్ని శాఖల్లోనూ పూర్తిస్థాయిలో ఎఫ్‌ఆర్ఎస్‌ను పటిష్టంగా అమలు చేయడంతో ఉద్యోగుల పనితీరును మెరుగు పరచవచ్చనే భావనలో ప్రభుత్వం ఉంది.

# పెను విషాదం

... 5వ పేజీ తరువాయి

వెల్లువెత్తుతున్నాయి. కైలాసపట్నం శివారున ఉన్న బాణసంచా కేంద్రానికి 2026 వరకు అనుమతులున్నాయని అధికారులు చెబుతున్నా, అగ్నిమాపక శాఖ నుంచి 2024 తరువాత రెన్యువల్ కోసం నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) పొందలేదని తెలుస్తోంది. ప్రమాదకరమైన పేలుడు సామగ్రి తయారుచేసే ఈ కేంద్రంలో పరిశ్రమల శాఖ నిబంధనల ప్రకారం కార్మికులకు తగిన రక్షణ చర్యలు లేవని అక్కడి పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి. భారీగా పేలుడు పదార్థాలు నిల్వ చేసి, సామగ్రి తయారు చేస్తున్నా కనీసం బోర్డు కూడా ఏర్పాటుచేయలేదు. ఈ కేంద్రంలో ఫైర్ ఎక్విప్‌మెంట్ ఉందా, కార్మికులకు మందుగుండు సామగ్రి తయారీపై శిక్షణ ఇచ్చారా..? ముడి పదార్థాల నిల్వలు సురక్షితంగా ఉన్నాయా... అనే ప్రశ్నలకు జవాబు దొరకడం లేదు. ప్రమాదం జరిగిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు కూడా బాణసంచా కేంద్రానికి అనుమతులున్నాయా లేదా అనేది స్పష్టం చేయలేకపోతున్నారు.

### మొక్కుబడి తనిఖీలు

వాస్తవానికి బాణసంచా కేంద్రాలను మండల రెవెన్యూ అధికారి సందర్శించి, ఇచ్చిన నివేదిక మేరకు ఆర్డీఓ స్థాయి అధికారి అనుమతులు జారీచేస్తారు. దీంతోపాటు పరిశ్రమలు, పర్యావరణ, అగ్నిమాపక శాఖలు ఏటా తనిఖీ చేసిన తరువాత మాత్రమే నిరభ్యంతర పత్రాలు ఇవ్వాలి. కాగా ఎలాంటి తనిఖీ చేయకుండానే నివేదికలు సమర్పించి మమ అనిపిస్తున్నారనే విమర్శలున్నాయి. ప్రమాదం సంభవించిన గంటల తరువాత జిల్లా యంత్రాంగం ఘటనా స్థలానికి చేరుకుంది. అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్‌సిన్హా, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి వెంకటరమణ తదితరులు ప్రమాద స్థలిని పరిశీలించారు.

### కనిపించని పర్యవేక్షణ

జిల్లాలోని బాణసంచా తయారీకేంద్రాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారుల పర్యవేక్షణ కనిపించడం లేదు. జిల్లా అగ్నిమాపక శాఖ అధికారిక రికార్డుల ప్రకారం కోటవురట్ల మండలం కైలాసపట్నం, ఎండపల్లి, నర్సీపట్నం మండలం వేములపూడి, మాకవరపాలెం మండలం భీమబోయినపాలెం, చోడవరంలోని ఎంకేపాలెం, అచ్యుతాపురంలో మాత్రమే బాణసంచా తయారీ కేంద్రాలకు అనుమతులున్నాయి. అయితే అనధికారికంగా ప్రతి మండలంలో బాణసంచా తయారీ జరుగుతోంది.

### ఉమ్మడి జిల్లాలోనూ సంఘటనలు

ఉమ్మడి విశాఖ జిల్లాలో బాణసంచా తయారీ కేంద్రాల్లో అనేక ప్రమాదాలు సంభవించాయి. 2011లో మొగలిపురంలో అనధికార బాణసంచా తయారీ కేంద్రంలో సంభవించిన పేలుడులో ఇద్దరు మృతి చెందారు. 2019లో సబ్బవరం మండలం గుల్లిపల్లిలో అనధికార బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన ప్రమాదంలో ఆరుగురు మృత్యువాతపడ్డారు. జిల్లా పునర్విభజన తరువాత 2022 జూన్‌లో సబ్బవరం మండలం ఆరిపాకలో అనధికార బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు సంభవించి నలుగురు మృతిచెందగా, ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. అనుమతులున్న వాటితో పాటు, అనధికార బాణసంచా తయారీ కేంద్రాల్లో భద్రతా చర్యలు శూన్యమనేది బహిరంగ రహస్యం. వీటిలో ప్రమాదాలు సంభవిస్తున్నా బయటకు పొక్కనీయడం లేదు.

### ప్రతి కుటుంబానిదీ ఓ దీనగాథ

కోటవురట్ల/ నర్సీపట్నం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కైలాసపట్నంలోని బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడులో మృతిచెందిన వారి కుటుంబాల్లో ఒక్కొక్కరిది ఒక్కో గాథ. ప్రమాదంలో మృతిచెందిన దాడి రామలక్ష్మి ఒంటరిగా జీవిస్తున్నది. ఆరేళ్ల క్రితం భర్త చనిపోయాడు. కుమార్తె ధనలక్ష్మికి గతంలోనే వివాహమైంది. ఆమె ఎలమంచిలి మండలం జంపపాలెంలో వుంటున్నది. మరో మృతుడు గంపెన వేణుకి భార్య భవాని,, కూతురు, కొడుకు ఉన్నారు. గుర్తు పట్టలేనంతగా వేణు మృతదేహం కాలిపోయింది. మొదట్లో చేనేత కార్మికుడిగా పని చేసేవాడు. ఆ వృత్తి కలిసి రాకపోవడంతో బాణసంచా తయారీ కేంద్రంలో కూలీగా వెళుతూ, ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు కైలాసపట్నం గ్రామానికి చెందిన పురం పాప భర్త చనిపోయి 10 సంవత్సరాలు అవుతున్నది. ఈమెకు ఇద్దరు పిల్లలు వున్నారు. బాణసంచా ప్రమాదంలో ఆమె చనిపోవడంతో పిల్లలు అనాథలయ్యారు. కైలాసపట్నం గ్రామానికి చెందిన సంగరాతి గోవిందకు భార్య, ఇద్దరు పిల్లలు పిల్లలు వున్నారు. ఆయన మృతితో కుటుంబం వీధిన పడింది.

# ఆరు గంటలు ఉత్కంఠ!

... 5వ పేజీ తరువాయి


చిన్నారిని తండ్రికి అప్పగిస్తున్న సీఐ సతీశ్ కుమార్

పిల్లలిద్దరూ సెల్లార్ పక్కన ఖాళీ స్థలంలోని ఇసుకలో ఆడుకుంటున్నారు. కేశవరావు సమీపంలో అపార్టుమెంట్ వాచ్‌మన్‌తో మాట్లాడుతున్నాడు. చీకటి పడడంతో పిల్లలను తీసుకువెళ్లేందుకు రాగా, రుగేశ్వరిశ్రీ కనిపించలేదు. పెద్దపాపను ఆరాతీయగా తెలియదని చెప్పడంతో ఆందోళన చెందారు. బంధువులు, స్నేహితులతో కలిసి వెతికినా ఫలితం దక్కలేదు. దీంతో డయల్ 112కు కాల్ చేయడంతో పెందుర్తి సీఐ కేవీ సతీశ్‌కుమార్, సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకున్నారు. అపార్ట్‌మెంట్ సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించినా ఆధారాలు లభించలేదు. దీంతో కిడ్నాప్ కోణంలో విచారణ చేపట్టారు. అపార్ట్‌మెంట్‌కు కొద్దిదూరంలో చెరువు ఉండడంతో డ్రోన్‌లను రంగంలోకి దింపారు.

### వీడిన ఉత్కంఠ..

డ్రోన్ కెమెరాలో పసిపాప జాడ కనిపించింది. లోకేషన్ అంతుచిక్కలేదు. దీంతో పోలీసులు టార్చిలైట్లు, ద్విచక్రవాహనాల వెలుగులో జల్లెడ పట్టారు. ఎట్టకేలకు చెరువు సమీపంలోని మట్టిలో పాపను గుర్తించారు. క్షేమంగా తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. రాత్రి ఏడు గంటలకు అదృశ్యమైన పాప ఆచూకీ అర్ధరాత్రి ఒంటి గంటకు లభించడంతో ఆరు గంటల ఉత్కంఠకు తెరపడింది. ఆడుకుంటూ చిన్నారి చెరువు వద్దకు వెళ్లిపోయిందని, మట్టిలో కూరుకుపోవడంతో బయటకు రాలేకపోయిందని సీఐ తెలిపారు.

## హనుమత్ సీతారామలక్ష్మణులకు వెండి కిరీటాలు



వెండి కిరీటాలతో విగ్రహాలు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : విశాలాక్షినగర్‌లోని సంజయ్‌నగర్ కాలనీలో వేంచేసి ఉన్న రామాలయంలోని హనుమత్ సీతారామలక్ష్మణులకు భక్తుడు అనిల్‌కుమార్ రాజు వెండి కిరీటాలను బహూకరించారు. ఇటీవల జరిగిన సీతారాముల కల్యాణ మహోత్సవాల సందర్భంగా ఈ వెండి కిరీటాలను నెహ్రూ యువ జన సేవా సంఘం వారికి అందజేశారు. సంఘం ఆధ్వర్యంలో శనివారం వెండి కిరీటాలను దేవతామూర్తులకు అలకరించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు నల్ల రవికుమార్ మాట్లాడుతూ ఈ నెల 15న పోలమాంబ అమ్మవారి జాతర, 18న ఆలయ వార్షికోత్సవం వేడుకలను ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్యశాస్త్రి సారధ్యంలో నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆరోజు మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమం కూడా ఉంటుందన్నారు.

## పలు రైళ్లు మళ్లింపు

**» రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ రద్దు**

విశాఖపట్నం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : ఖుర్దారోడ్డు డివిజన్ పరిధిలో నాన్ ఇంటర్ లాకింగ్ పనులు జరుగుతున్నందున పలు రైళ్లను మళ్లింపు మార్గంలో నడిపిస్తున్నట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. అలాగే రౌర్కెలా-గుణుపూర్ మధ్య రాకపోకలు సాగించే రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ రైళ్లను(18117/18118) ఈ నెల 14 నుంచి 23 వరకు రద్దు చేశామని పేర్కొన్నారు.

రైళ్ల దారి మళ్లింపు: విశాఖ-అమృతసర్ హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ (20807) ఈ నెల 18, 19, 22 తేదీల్లో విజయనగరం, టిట్లాగర్, బొలంగీర్, సంబల్‌పూర్, ఝూర్సుగుడ మీదుగా...అమృతసర్-విశాఖ హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ (20808) ఈ నెల 16, 19, 20 తేదీల్లో ఝూర్సిగుడ, సంబల్‌పూర్, బొలంగీర్, టిట్లాగర్, విజయనగరం మీదుగా నడుస్తాయి. ఈ నెల 15 నుంచి 23 వరకు భువనేశ్వర్-ఎల్‌టీటీ-భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్ (12880/12879), పూరి-ఎల్‌టీటీ-పూరి ఎక్స్‌ప్రెస్ (22866/22865), పూరి-అజ్మీర్-పూరి ఎక్స్‌ప్రెస్ (20823/20824)), సూరత్-పూరి-సూరత్ (22828/22827), పూరి-అహ్మదాబాద్-పూరి ఎక్స్‌ప్రెస్ (20861/20862) రైళ్లు టిట్లాగర్, విజయనగరం మీదుగా రాకపోకలు సాగిస్తాయన్నారు.

## భక్తిశ్రద్ధలతో మట్టల పండుగ

ఆరిలోవ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : మట్టల ఆదివారం సందర్భంగా ఆరిలోవ ప్రాంతంలో ఏసు విశ్వాసకులు ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ కీర్తనలు ఆలపిస్తూ వీధుల్లో తిరిగారు. ఈత మట్టలకు పూలను అలంకరించి పలు ప్రాంతాల్లో ఊరేగింపు చేపట్టారు.

## సినిమా గైడ్

● గుడ్, బ్యాడ్, అగ్లీ : శ్రీవెంకటేశ్వర, సంగం, నరసింహ (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం) అరుణ (పెదగంట్యాడ)

● జాక్ : జగదాంబ, శ్రీకన్య, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహా-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం),

● రాబిన్‌హుడ్ : శ్రీలీలామహల్, గోకుల్,

● మ్యాడ్ : జగదాంబ, శరత్, కన్య (గాజువాక)

● పెళ్ళికాని ప్రసాద్ :శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), వరౌర్య (గోపాలపట్నం), తాతా(తగరపువలస)

కోర్ట్ : జగదాంబ, మినీ మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

## రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 20, టమాటా 17, వంకాయలు (తెలుపు) 18, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 30, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 34, బీరకాయలు 42, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 18, క్యాబేజి 12, క్యారెట్ 28 దొండకాయలు 22, బంగాళ దుంపలు 17, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 34,అల్లం (పాతది) 48, బరబాటి 26,ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 62, దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 52, కీరదోస 24, కాప్సికమ్ 46, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 28 చిలగడదుంపలు 36, కంద 64, దేముడుచిక్కుడు 64, గోరుచిక్కుడు 38, కూరపెండలం 26, బ్రకోలి 45, పనస పొట్టు200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 50, బూడిద గుమ్మడికా య 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 48, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

| కోడిగుడ్లు (నెక్) | (వంద - రూ.లలో) |
|---|---|
| విశాఖపట్నం | 415 |
| విజయనగరం | 419 |
| శ్రీకాకుళం | 419 |

| చికెన్ ధరలు | |
|---|---|
| బ్యాగ్ | |
| రైతు ధర | 110 |
| లైవ్ ధర | 130 |
| విత్ స్కిన్ | 230 |
| స్కిన్‌లెస్ | 240 |

# నిర్లక్ష్యానికి మూల్యం

» కాలువలో పూడిక తొలగించకపోవడంతో వర్షానికి వీధుల్లోకి మురుగు

» ఇసుకతోట పెట్రోల్ బంకు సమీపంలో ఇళ్లల్లోకి చొచ్చుకురావడంతో స్థానికుల ఇబ్బందులు

» తాపీగా నష్ట నివారణ చర్యలు చేపట్టిన అధికారగణం

» జీవీఎంసీ ఇంజినీరింగ్ తీరుపై విమర్శల వెల్లువ



ఇసుకతోట పెట్రోలు బంకు వద్ద పనులు నిర్వహిస్తున్న దృశ్యం

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పారిశుధ్య విభాగం తీరుకు ఇదో నిదర్శనం. వర్షాలు లేనప్పుడు ప్రతి కాలువ, గెడ్డ వంటివి పూడిక తొలగించి, నీటి ప్రవాహానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా చూసుకోవాలి. కానీ పై అధికారుల పర్యవేక్షణ కొరడడంతో కిందిస్థాయి సిబ్బంది పెద్దగా పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. దీంతో కింది స్థాయి సిబ్బంది 'ఏదో అయిందనిపించేలా' పనులు చేసి వదిలేస్తున్నారు. కొద్ది రోజుల క్రితమే పూడిక తొలగించి, తరలించకుండా పక్కనే గుట్టగా వదిలేశారు. దీనిపై కథనం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చింది. అయినప్పటికీ అధికారులు స్పందించలేదు.

మూడు రోజుల క్రితం ఆకస్మికంగా కురిసిన వర్షానికి ఇసుకతోట పెట్రోలు బంకు సమీపంలో రోడ్డు మునిగిపోయింది. అలాంటి పరిస్థితి గతంలో ఎప్పుడూ లేదు. గెడ్డ, కాలువల్లోని మురుగునీరు బయటకు వచ్చేసింది. రోడ్డును ఆనుకుని ఉన్న భవనాల్లోకి మురుగునీరు చొచ్చుకెళ్లింది. ఓ మిఠాయి దుకాణం కట్టేసి ఉండడంతో లోపలకు వచ్చిన వరదకు సుమారు మూడు లక్షల రూపాయల విలువైన ఆహార పదార్థాలు పాడయ్యాయి. ఈ రోడ్డు పక్కన ఉన్న దుకాణాలే కాకుండా, ఆ వెనుక ఉన్న ఇళ్లల్లోకి కూడా మురుగు నీరు చేరింది. అక్కడే ఓ శాశనసభ్యుడి నివాసం కూడా ఉంది. వారింట్లోకి కూడా నీరు వెళ్లిపోవడంతో జీవీఎంసీ అధికారులపై సదరు ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. దీంతో పరుగున వచ్చిన అధికారులకు అక్కడేం జరిగిందో ఓ పట్టాన అర్థం కాలేదు. తర్వాత చూస్తే పెట్రోలు బంకు ముందు ఉన్న ప్రధాన కాలువలో చెత్తాచెదారం అడ్డుపడి, నీటి ప్రవాహం ఆగిపోయింది. ఇప్పుడు దానిని సరిచేసే పనిలో భాగంగా పొక్లెయిన్‌తో తవ్వుతున్నారు. అయితే ఇక్కడ అడ్డు తొలగించినంతటే ముప్పు తొలగిపోయే అవకాశం లేదని, ఇంజనీరింగ్ అధికారులు అంటున్నారు. ఈ కాలువ ప్రధాన రహదారి కింద నుంచి ప్రవహిస్తోంది. ఆ కింద పరిస్థితి ఎలా ఉందో తెలీదు. ఈ కాలువలోకి శివాజీ పార్కు పరిసర ప్రాంతాల నుంచి వచ్చే మురుగునీరు ఇసుకతోట, ఐసీఐసీఐ కూడలి వరకూ రోడ్డు కింది నుంచి ప్రవహించి, లాసన్స్‌బే వరకూ వెళుతుంది. ప్రస్తుతం పెట్రోలు బంకు వద్ద తవ్విన మట్టే భారీగా వచ్చింది. ఈ సమస్య వల్ల బంకులో సగం మట్టితో నిండిపోయింది.

ఎప్పటికప్పుడు పూడికలు తొలగించకపోవడంతో ఆకస్మికంగా వర్షం పడినప్పుడు కాలువల్లో ప్రవాహం ఆగిపోయి, బయటకు మురుగు వచ్చేస్తోంది. ప్రస్తుతం చేస్తున్న పనుల వల్ల తాత్కాలికంగా ప్రవాహానికి అడ్డు తొలగినా, ప్రధాన రహదారి కింద పరిస్థితి ఏమిటో ఇప్పుడే చూడకపోతే మళ్లీ ముప్పు తప్పకపోవచ్చని ఇంజనీరింగ్ వర్గాలు అంటున్నాయి. పూడికలు సరిగ్గా తీయకపోవడం, తీసిన పూడిక గుట్టలు తరలించకపోవడం వల్ల ముంపు ముప్పు ఉంటుందనడంలో సందేహం లేదు.

## ఘనంగా వేంకటేశ్వరస్వామి సామూహిక వ్రతాలు



సామూహిక వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి) : తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీ టీటీడి కళ్యాణమండపంలో ఆదివారం నిర్వహించిన శ్రీ వేంకటేశ్వరస్వామి వ్రతానికి భక్తులు భారీగా హాజరయ్యారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి పన్నెండు గంటల వరకూ నిర్వహించిన పూజా కార్యక్రమంలో భక్తులకు తిరుపతి దేవస్థానం ద్వారా పూజా సామగ్రిని ఉచితంగా అందించారు. జిల్లా ధార్మిక కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కూచిపూడి, భరతనాట్యం, సంకీర్తనల వంటి సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ప్రదర్శించారు. తిరుమల దేవస్థానం వేద పండితులు వేద పారాయణం నిర్వహించారు. అన్నమయ్య సేవా సంస్థ సభ్యులు, వివిధ ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంస్థలు సహకారం అందించాయి. సుమారు వెయ్యి మంది భక్తులు పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు.

## ఘనంగా మట్టల పండుగ



మట్టలు చేతపట్టి గీతాలు ఆలపిస్తున్న క్రైస్తవులు

అక్కిరెడ్డిపాలెం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : గుడ్ ఫ్రైడే ముందు ఆదివారం క్రైస్తవులు నిర్వహించే మట్టల ఆదివారం సందర్భంగా 68, 69 వార్డుల పరిధిలోని క్రైస్తవ మందిరాలలో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. షీలానగర్ లోని హయ్యర్ మెమోరియల్ లూథరన్ చర్చితో పాటు సీయోను ప్రార్థనామందిరాలకు చెందిన పిల్లలతో పాటు పెద్దలు ఈత మట్టలకు రంగురంగుల పూలు గుచ్చి కాలనీలో క్రీస్తు గీతాలను ఆలపిస్తూ మట్టల ఆదివారం నిర్వహించారు. బీహెచ్‌పీవీ, తుంగ్లాం కాలనీలలోని చర్చిల్లో కూడా మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు.

## దుర్గానగర్‌లో ఉచిత నేత్ర వైద్య శిబిరం



కళ్లద్దాలను అందజేస్తున్న సీపీఐ నాయకులు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : సీపీఐవంద సంవత్సరాల వార్షికోత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 15వ వార్డు దుర్గానగర్‌లో అపోలో క్లినిక్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 140 మంది దుర్గానగర్ కొండవాలు ప్రాంత ప్రజలకు ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి సీపీఐ తూర్పు నియోజకవర్గం కార్యదర్శి ఎస్.కె.రెహ్మాన్ చేతుల మీదుగా కంటి అద్దాలు, మందులు అందజేశారు.

## ప్రేక్షకుల స్పందన ఆనందం కలిగిస్తోంది

**» 'అక్కడ అమ్మాయి..ఇక్కడ అబ్బాయి' చిత్ర హీరో ప్రదీప్ మాచిరాజు**




సమావేశంలో మాట్లాడుతున్న ప్రదీప్ మాచిరాజు

మహారాణిపేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రేక్షకుల పెదవులపై చిరునవ్వులే మాకు సంతోషం కలిగిస్తుందని 'అక్కడ అమ్మాయి..ఇక్కడ అబ్బాయి' సినిమా హీరో ప్రముఖ యాంకర్ ప్రదీప్ మాచిరాజుఅన్నారు. ప్రదీప్, దీపికా పిల్లి హీరో హీరోయిన్లుగా నితిన్ భరత్ దర్శకత్వంలో రూపొందించిన ఈ చిత్రం ఇటీవల విడుదలై విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా ఆదివారం చిత్ర యూనిట్ విశాఖలో సక్సెస్ టూర్ నిర్వహించింది. దసపల్లా హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో హీరో ప్రదీప్ మాట్లాడుతూ ఈ చిత్రానికి సపోర్టు చేసిన హీరోలు మహేష్‌బాబు, రామ్‌చరణ్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రేక్షకుల ఎలా ఆదరిస్తున్నారో తెలుసుకునేందుకు నగరంలో వివిధ థియేటర్లకు వెళ్లి చూశామని, ఈ సినిమా ఆద్యంతం ప్రేక్షకులు నవ్వుకుంటుండడం చాలా సంతోషం కలిగించిందన్నారు. ఇలాంటి క్లీన్ కామెడీ ఎంటర్‌టైన్‌మెంట్ చూసి చాలారోజులైనట్లు ప్రేక్షకులు చెప్పారన్నారు. ఈ సినిమా కోసం శ్రమించిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

హీరోయిన్ దీపికా మాట్లాడుతూ ప్రేక్షకులు ఈ సినిమాను ఇంతలా ఆదరించటం చాలా ఆనందం కలిగించిందని అన్నారు. ఈ సమావేశంలో దర్శకుడు నితిన్ భరత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

**'పశ్చిమ' ఎమ్మెల్యే గణబాబు**



మాట్లాడుతున్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

బీచ్ రోడ్డు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : క్రీడారంగంలో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, క్రీడాకారులు ఎప్పుడూ క్రీడా స్ఫూర్తితో మెలగి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని పశ్చిమ నియోజకవర్గం శాసనసభ సభ్యులు పి.గణ బాబు పేర్కొన్నారు. ఆదివారం బీచ్ రోడ్డు వద్ద ఉన్న అంబికా శ్రీగ్రీన్ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ. క్రీడాకారులకు ఇతరులతో కలిసి లక్ష్యాలను సాధించే నైపుణ్యం అవసరమన్నారు. క్రీడారంగంలో వస్తున్న మార్పులకు తగినట్టుగా యువత నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. క్రీడాకారులు కాలానుగుణంగా కొత్త నైపుణ్యాలను నేర్చుకోవాలన్నారు. ప్రతి క్రీడాకారుడు నేర్చుకోవాలనే తపన, ఆసక్తితో ముందుకు సాగాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడాకారులకు నిధులు సమకూర్చడమే కాకుండా భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని వసతులు సమకూరుస్తాయన్నారు. అనంతరం ప్రతిభ కనబరచిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ కోటేశ్వరరావు, క్రీడాకారులు గోపినాథ్, రవికుమార్, రమేష్‌కుమార్, ఎస్.రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఆందోళనకరంగా విద్యా ప్రమాణాలు

**» ఆలిండియా డెమోక్రటివ్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ నగర అధ్యక్షుడు అభిలాష్**

వెంకోజీపాలెం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో విడుదలైన ఇంటర్మీడియేట్ ఫలితాలు ఆధారంగా ప్రభుత్వ కళాశాలలో విద్యా ప్రమాణాలు క్షీణిస్తున్నాయన్న విషయం స్పష్టమవుతోందని ఆల్ ఇండియా డెమోక్రటివ్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ నగర అధ్యక్షుడు కె.అభిలాష్ ఆదివారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కళాశాలలో ఉత్తీర్ణత శాతం గణనీయంగా పడిపోవడానికి ప్రభుత్వ రంగ విద్యను దెబ్బ తీయడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలే ప్రధాన కారణమని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్ విద్యను మెరుగుపరుస్తామని గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ.. ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలలో ఉపాధ్యాయ, అధ్యాపక, నాన్-టీచింగ్ పోస్టులను శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయకపోవడమే విద్యా ప్రమాణాలను తీవ్రంగా దెబ్బ తీస్తోందన్నారు. సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని, ఇది విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తోందన్నారు. అంతేకాకుండా పాఠశాల స్థాయి నుంచి పాస్/ ఫెయిల్ విధానం లేకపోవడం విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పడిపోవడానికి మరో ముఖ్య కారణమన్నారు. ఉపాధ్యాయుల్లో అంకితభావం, విద్యార్థులలో ఆసక్తి, తపన కొరవడుతోందన్నారు. చదవకపోయినా ఉత్తీర్ణత సాధించవచ్చనే దురభిప్రాయం విద్యార్థుల్లో నెలకొనడంతో వారిలో అశ్రద్ధ పెరుగుతోందన్నారు. ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలల్లోని అన్ని ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. పాఠశాల స్థాయి నుంచి పాస్/ ఫెయిల్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసే ప్రైవేటీకరణ విధానాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

## అంగరంగ వైభవంగా దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ పెద్దలు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : కొత్త వెంకోజీపాలెంలోని శ్రీ సమర్థ సద్గురు సాయినాథ్ ఆలయ ప్రాంగణంలో ఆదివారం ప్రతి శ్రీపంచనాగ సహిత, నాగబంధ సమేత శ్రీవల్లీ దేవసేన సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాలు, యంత్ర ప్రతిష్ఠ అంగరంగ వైభవంగా జరిగింది. వేద మంత్రాల నడుమ, మంగళవాయిద్యాల తోడ ప్రత్యేక అభిషేకాలతో దేవతామూర్తుల ప్రతిష్ఠను కన్నుల పండువగా నిర్వహించారు. గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొని దేవతామూర్తులను భక్తితో కొలిచారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి సూర్యప్రకాష్‌శర్మ, సుబ్రహ్మణ్యశాస్త్రి, ప్రభాకరశర్మ, కిశోర్ శర్మలు దేవతా మూర్తులకు ప్రత్యేక అభిషేకాలు జరిపి విఘ్నేశ్వర పూజతో ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం ఆలయం వద్ద మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు పీల కనకరాజు, ప్రధాన కార్యదర్శి కాళ్ల పోలినాయుడు, ఉపాధ్యక్షులు పీల నాగేశ్వరరావు, ఆడిటర్ కాండ్రేగుల నూకేష్, ఆలయ కమిటీ సభ్యులు బొడ్డేటి నర్సింగరావు, మద్దాల నరసింగరావు, సుంకరి నరసింహారెడ్డి, ద్రాక్షరపు నూకరాజు, బొడ్డేటి సూర్యనారాయణ, మద్దాల వీర వెంకట అప్పారావు, టీడీపీ నాయకులు బోర ధనరెడ్డి, కాళ్ల శంకర్, ఆడారి కామేశ్వరరావు పాల్గొన్నారు.

## అమ్మవారి జాతరకు ఎమ్మెల్యే వంశీకృష్ణకు ఆహ్వానం

మద్దిలపాలెం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : శివాజీపాలెంలో ఆదివారం పీతలవానిపాలెం గ్రామ దేవత చిన్న పోలమాంబ అమ్మవారి జాతర మహోత్సవాలకు హాజరుకావాలని కోరుతూ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్‌కు గ్రామ పెద్దలు ఆహ్వాన పత్రిక అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ ఏడాది చిన్న పోలమాంబ అమ్మవారి జాతర ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. పెద్దల ఆహ్వానం మేరకు వేడుకల్లో పాల్గొని తనవంతు సహాయసహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణ సేవాసంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ఇక రోజూ కేజీహెచ్‌లో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు

» మందుల పంపిణీలో పరిమితి

» వైద్యుల ప్రిస్క్రిప్షన్‌పై ఆడిట్

» ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్



వివరాలు వెల్లడిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్

మహారాణిపేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : కేజీహెచ్‌లో ఇకపై రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందుబాటులో ఉంటాయని సూపరింటెండెంట్ డాక్టర్ కె.శివానంద్ తెలిపారు. కార్డియాలజీ, న్యూరాలజీ, న్యూరోసర్జరీ, యూరాలజీ, పీడియాట్రిక్ సర్జరీ, గ్యాస్ట్రో, ఎండోక్రైన్, మెడికల్ అండ్ సర్జికల్ క్యాన్సర్, ప్లాస్టిక్ సర్జరీ తదితర 12 విభాగాలకు ఉదయం నుంచి సాయంత్రం వరకు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఆదివారం కేజీహెచ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పలు మార్పులను వివరించారు.

**పరిమితంగానే మందులు**

కేజీహెచ్‌లో మందుల కొరత లేకపోయినా.. కొందరు వైద్యులు రాస్తున్న ప్రిస్క్రిప్షన్ కారణంగా దుర్వినియోగం అవుతున్నాయనే కారణంతో పరిమితి విధించినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ తెలిపారు. కొన్ని విభాగాల వైద్యులు రోగికి వారం, పది రోజులకు రాయవలసిన యాంటీబయాటిక్స్, పారాసెటమాల్ వంటి మందులను అధిక మోతాదులో ప్రిస్క్రిపన్ ఇవ్వడం వల్ల వృథా అవుతున్నాయని పేర్కొన్నారు. అధిక మోతాదులో మందులు వాడడం వల్ల రోగికీ నష్టమేనని, దీనిని దృష్టిలో ఉంచుకుని పరిమితి విధించినట్లు పేర్కొన్నారు. ఏ విభాగం నుంచి ఎక్కువ మోతాదులో మందులు రాస్తున్నారో గుర్తించి అక్కడ మాత్రమే పరిమితి విధించామని తెలిపారు. కేవలం జ్వరం, నొప్పులతో బాధపడేవారు సహా చిన్న చిన్న అనారోగ్య కారణాలతో వచ్చేవారికి అవసరం మందులు ఇస్తామన్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులకు, సూపర్ స్పెషాలిటీ వైద్య చికిత్సలు పొందేవారికి మందుల సరఫరాలో ఎలాంటి పరిమితి విధించలేదని స్పష్టంచేశారు. అలాంటి విభాగాల్లో వైద్యులు రోగి చికిత్సకు అవసరమైన మందులు యథాతథంగా సిఫార్సు చేయవచ్చన్నారు. మందులు దుర్వినియోగం కాకుండా వైద్యుల ఆడిట్ కమిటీ, ప్రిస్క్రిప్షన్ ఆడిట్ కమిటీలను నియమించినట్లు డాక్టర్ శివానంద్ వెల్లడించారు. వైద్యుల ప్రిస్క్రిప్షన్‌పై రెండు వారాలకు ఒకసారిఆడిట్ నిర్వహిస్తామన్నారు. సక్రమంగా మందులు అందించాలనే దృక్పథంతోనే ఈ పద్ధతి పాటించను న్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వాసవీ లత, ఆర్ఎంవో డాక్టర్ మెహర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బాలికపై బాబాయ్ అసభ్య ప్రవర్తన

**» పోలీసుల కళ్లుగప్పి నిందితుడు పరారీ**

కంచరపాలెం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వరుసకు కుమార్తె అయిన బాలికపై బాబాయ్ అసభ్యంగా ప్రవర్తించిన ఘటన కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధి ధర్మానగర్‌లో ఆదివారం జరిగింది. రాములవారి వీధిలో ముగ్గురు కుమార్తెలతో దంపతులు నివాసం ఉంటున్నారు. ఉదయం తల్లిదండ్రులు పనిమీద బయటకు వెళ్లారు. ఆ సమయం చూసిన బాబాయ్ సురేష్ ఇంట్లోకి ప్రవేశించాడు. ఆ దంపతుల రెండో కుమార్తె దుస్తులు మార్చుకుంటుండగా సురేష్ లోనికి ప్రవేశించగా బాత్రూంలోకి వెళ్లి దాక్కుంది. అదే సమయంలో అక్కడే ఉన్న మరో ఇద్దరు కుమార్తెలు సురేష్‌ను అడ్డుకొనగా వారితో అసభ్యంగా తిట్టాడు. బాలిక నాన్నమ్మ, తల్లిదండ్రులు ఇంటికి చేరుకుని సురేష్‌ను నిలదీయగా వారిపై దాడిచేశాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని అతడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు విచారణ చేస్తుండగా రాత్రి 8 గంటల సమయంలో సురేష్ పోలీస్ స్టేషన్ నుంచి పారిపోయాడు. గతంలో అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్డులో జరిగిన హత్య కేసులో సురేష్ నిందితుడు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కంచరపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## మహిళా అభ్యున్నతిని కాంక్షిస్తూ ప్రపంచ యాత్ర



దయాళ్ భరద్వాజ్‌కు సత్కరిస్తున్న నిర్వాహకులు

బీచ్ రోడ్డు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : మహిళా లక్ష్య సాధనకు కృషి చేయాలని యూత్ హాస్టల్ ప్రతినిధి దయాళ్ భరద్వాజ్ పేర్కొన్నారు. ఆదివారం యూత్ హాస్టల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బీచ్ రోడ్డు వద్ద ఉన్న యూత్ హాస్టల్‌లో ఇష్టాగోష్ఠి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోని మహిళలు స్థితిగతుల గురించి తెలియజేసేందుకు ప్రపంచయాత్ర చేపట్టడం జరిగిందని తెలిపారు. ఏడు ఖండాల్లో 195 దేశాల మీదుగా సుమారు 12 ఏళ్ల పాటు తన యాత్ర కొనసాగుతుందని తెలిపారు. 2025, మార్చి 8న గుజరాత్‌లోని బరోడాలో తన యాత్ర ప్రారంభమైందన్నారు. రాష్ట్రంలో 350 మంది మహిళలతో మాట్లాడినట్టు తెలిపారు. విశాఖ జిల్లా చైర్మన్ ఇబ్రహీం మాట్లాడుతూ మహిళల కోసం ప్రపంచ యాత్ర చేయడం గొప్ప విషయమని చెప్పారు. కార్యక్రమంలో ఎన్.నాగేశ్వరరరావుపాలూరు శేషమాంబ, జగపతి రాజు, వర్మరాజు, రజనీకాంత్‌పాల్గొన్నారు.

## కారు ఢీకొని వృద్ధుడి మృతి

ఆరిలోవ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : చినగదిలిలో గల నవ్య ఆస్పత్రి సమీపం వద్ద బీఆర్‌టీఎస్ రోడ్డు దాటుతుండగా హనుమంతవాక వైపు నుంచి సింహాచలం వైపు వెళుతున్న కారు వేగంగా వచ్చి బిజు పాండా (60) బలంగా ఢీకింది. దీంతో బిజు పండా అక్కడికక్కడే మృతి చెందాడు. ఆరిలోవ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కారు డ్రైవరును పోలీసులు అదుపులోకి తీసుకొని ఆరిలోవ పోలీసు స్టేషన్‌కు తరలించారు. బిజు పండా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నటు సీఐ మల్లేశ్వరరావు తెలిపారు.

# అప్పన్న ఉంగరం దొరికింది

- ఈఓ నుంచి భక్తుల వరకూ అందరూ అనుమానితులే
- ఎట్టకేలకు ఏడో ముసుగులో దొరికిన అంగుళీయకం
- వైభవంగా స్వామివారి వినోదోత్సవం


రాజాలంకారంలో గోవిందరాజస్వామి.

సింహాచలం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): అప్పన్న స్వామి వార్షిక తిరుకల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం వినోదోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామి వారి ఆలయంలో భక్తుల ఆందోళనలు, ఆనందోత్సాహాల నడుమ ఈ వేడుక ఆసక్తికరంగా సాగింది. శనివారం రాత్రి స్వామివారు తన దేవేరులు, మంది మార్బలంతో కలిసి అడవికి వేటకు వెళ్లగా నీలుడు (తిరుమంగై ఆళ్వార్) అనే చోరుడు దారి కాచి ఆ మార్గం గుండా వెళ్లే వారిని దోచుకునే క్రమంలో స్వామివారి ఉంగరాన్ని కూడా అపహరిస్తాడు. ఈ ఉదంతాన్ని అర్చకులు కళ్లకు కట్టినట్లు అభినయించిన సంగతి తెలిసిందే. ఉంగరం దొరికిన ఘట్టాన్ని ఆదివారం వినోదోత్సవంగా నిర్వహించారు. ఉదయం 5 గంటలకు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపిన అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని స్వర్ణాభరణాలతో కాలుపై కాలు వేసుకుని ఠీవిగా కూర్చున్న రాజుగా అలంకరించి అతనిపై ఏడు ముసుగులు వేశారు. తొలుత ఆలయ బేడా మండపంలో తిరువీధి జరిపారు. ప్రధాన రాజగోపురం వద్ద స్వామివారిని ఉంచి పురోహితులు కరి సీతారామాచార్యులు దొంగలను వెతికే పనిలో పడ్డారు. ఈ క్రమంలో తొలుత ఆలయ దిగువ శ్రేణి ఉద్యోగులకు అధికారి కొత్వాల్ నాయకుడు లంక సూరిబాబు, వైదిక సిబ్బంది ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్‌ను, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఐవీ రమణాచార్యులు, అనుమానితులుగా పట్టుకుని విచారించి తొలి ముసుగు తొలగించారు. అదే క్రమంలో దేవస్థానం ఈఓ సుబ్బారావును సతీసమేతంగా, ఏఈఓ ఆనందకుమార్, పర్యవేక్షణాధికారి ప్రసాద్, కొందరు యువతను, విద్యార్థులను అనుమానితులుగా పట్టుకున్నారు. వారిని స్థానాచార్యులు రాజగోపాల్ న్యాయమూర్తిగా వ్యవహరించి విచారించారు. అనుమానితులుగా పట్టుబడిన వారిలో అనపర్తి సమీపంలోని మామిడాడ గ్రామానికి చెందిన గాయత్రి విద్యా పరిషత్‌లో తృతీయ సంవత్సరం ఎంబీబీఎస్ విద్యార్థినులు, కొత్తవలస ప్రాంతానికి చెందిన శ్రావణి, భార్గవి, యోగిత విషయం తెలియక కన్నీటి పర్యంతమయ్యారు. బీఎల్ పూర్తి చేసుకున్న విద్యార్థినులు ముగ్గురు, వడ్డాది ప్రాంతానికి చెందిన వ్యక్తి అధికారులను తీవ్రస్థాయిలో ప్రతిఘటించి వాగ్వివాదానికి దిగాడు. తమను అనుమానించడానికి గల సాక్ష్యాలు చూపాలంటూ వీరంగం సృష్టించారు. చివరకు అనుమానితులంతా ఇది ఉత్సవంలో భాగమని


దొరికిన ఉంగరాన్ని చూపుతున్న అర్చకులు, చిత్రంలో ఆలయ అధికారులు


పట్టుబడిన ఎంబీబీఎస్ విద్యార్థులు

తెలుసుకుని ఆనందం వ్యక్తం చేశారు. ఒక్కొక్క ముసుగు తొలగిస్తూ ఏడవ ముసుగును తొలగించగా, పోయిన ఉంగరం దొరికిందంటూ అర్చక స్వామి చూపడంతో అంతా హమ్మయ్య! అంటూ ఆనందించారు. అనంతరం సాధారణ సతీపతుల మధ్య జరిగే స్వల్ప వివాదాల మాదిరిగా స్వామివారు, అమ్మవార్ల నడుమ సంవాద సేవ నిర్వహించారు. స్వామివారిని ఆలయ ధ్వజ స్తంభం వద్ద బయట పల్లకిలో, లోపల అమ్మవార్లను ఆలయ ఆస్థాన మండపంలో ఉంచి కీర్తనలు ఆలపించారు. సంవాదం అనంతరం పూల బంతులు విసురుకునే వేడుకలో పలువురు భక్తులు ఇరువర్గాలుగా అమ్మవార్లు, అయ్యవారి తరఫున పాల్గొన్నారు. స్వామివారిని అమ్మవార్లను బేడా మండపంలో ప్రదక్షిణలు జరిపారు. ఉత్సవం అనంతరం ఆలయంలో మహాసంప్రోక్షణ చేసి, బాలభోగం, రాజభోగం నివేదనలు చేశారు. భక్తులకు మధ్యాహ్నం 11.30 నుంచి 2.30 వరకు దర్శనాలు నిలుపుదల చేశారు.

## పూర్వ విద్యార్థుల ఆనంద హేల

సీతమ్మధార ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఆప్యాయ పలకరింపులతో పూర్వ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా జరిగాయి. గురుద్వారా దరి వసంతబాల విద్యోదయ హైస్కూల్ 1999-2000 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాల సమీపంలో ఉన్న వెన్నెల ఫంక్షన్ హాల్‌లో పాతికేళ్ల తరువాత కలుసుకుని ఆనందంగా గడిపారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ చదువుకున్న రోజుల్లో అనుభూతులను గుర్తుచేసుకొని సంతోష సాగరంలో ఓలలాడారు. వసంతబాల స్కూల్ టీచర్స్ ఉషారాణి, ఉషాకుమారి, కమలాకర్, ఉమాదేవి, సుబ్బలక్ష్మి రమణ, అటెండర్ ముత్యాలు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులతో ఆనందంగా వేడుకలు జరుపుకొన్నారు. ఈ కార్యక్రమానికి లీలామాధవి, వనిత, యు.శ్రీనివాస్, అచ్యుత్, రామకృష్ణ, పి.సతీష్, హరి, పద్మలు పూర్వవిద్యార్థుల కలయిక కోసం ఎంతో కృషి చేశారు.


ఉపాధ్యాయులతో కలిసి పూర్వవిద్యారుల బృంద చిత్రం

## పెను విషాదం

... 5వ పేజీ తరువాయి

వెల్లువెత్తుతున్నాయి. కైలాసపట్నం శివారున ఉన్న బాణసంచా కేంద్రానికి 2026 వరకు అనుమతులున్నాయని అధికారులు చెబుతున్నా, అగ్నిమాపక శాఖ నుంచి 2024 తరువాత రెన్యువల్ కోసం నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) పొందలేదని తెలుస్తోంది. ప్రమాదకరమైన పేలుడు సామగ్రి తయారుచేసే ఈ కేంద్రంలో పరిశ్రమల శాఖ నిబంధనల ప్రకారం కార్మికులకు తగిన రక్షణ చర్యలు లేవని అక్కడి పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి. భారీగా పేలుడు పదార్థాలు నిల్వ చేసి, సామగ్రి తయారు చేస్తున్నా కనీసం బోర్డు కూడా ఏర్పాటుచేయలేదు. ఈ కేంద్రంలో ఫైర్ ఎక్విప్‌మెంట్ ఉందా, కార్మికులకు మందుగుండు సామగ్రి తయారీపై శిక్షణ ఇచ్చారా..? ముడి పదార్థాల నిల్వలు సురక్షితంగా ఉన్నాయా... అనే ప్రశ్నలకు జవాబు దొరకడం లేదు. ప్రమాదం జరిగిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు కూడా బాణసంచా కేంద్రానికి అనుమతులున్నాయా లేదా అనేది స్పష్టం చేయలేకపోతున్నారు.

### మొక్కుబడి తనిఖీలు

వాస్తవానికి బాణసంచా కేంద్రాలను మండల రెవెన్యూ అధికారి సందర్శించి, ఇచ్చిన నివేదిక మేరకు ఆర్డీఓ స్థాయి అధికారి అనుమతులు జారీచేస్తారు. దీంతోపాటు పరిశ్రమలు, పర్యావరణ, అగ్నిమాపక శాఖలు ఏటా తనిఖీ చేసిన తరువాత మాత్రమే నిరభ్యంతర పత్రాలు ఇవ్వాలి. కాగా ఎలాంటి తనిఖీ చేయకుండానే నివేదికలు సమర్పించి మమ అనిపిస్తున్నారనే విమర్శలున్నాయి. ప్రమాదం సంభవించిన గంటల తరువాత జిల్లా యంత్రాంగం ఘటనా స్థలానికి చేరుకుంది. అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్‌సిన్హా, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి వెంకటరమణ తదితరులు ప్రమాద స్థలిని పరిశీలించారు.

### కనిపించని పర్యవేక్షణ

జిల్లాలోని బాణసంచా తయారీకేంద్రాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారుల పర్యవేక్షణ కనిపించడం లేదు. జిల్లా అగ్నిమాపక శాఖ అధికారిక రికార్డుల ప్రకారం కోటవురట్ల మండలం కైలాసపట్నం, ఎండపల్లి, నర్సీపట్నం మండలం వేములపూడి, మాకవరపాలెం మండలం భీమబోయినపాలెం, చోడవరం మండలం ఎంకేపాలెం, అచ్యుతాపురంలో మాత్రమే బాణసంచా తయారీ కేంద్రాలకు అనుమతులున్నాయి. అయితే అనధికారికంగా ప్రతి మండలంలో బాణసంచా తయారీ జరుగుతోంది.

### ఉమ్మడి జిల్లాలోనూ సంఘటనలు

ఉమ్మడి విశాఖ జిల్లాలో బాణసంచా తయారీ కేంద్రాల్లో అనేక ప్రమాదాలు సంభవించాయి. 2011లో మొగలిపురంలో అనధికార బాణసంచా తయారీ కేంద్రంలో సంభవించిన పేలుడులో ఇద్దరు మృతి చెందారు. 2019లో సబ్బవరం మండలం గుల్లిపల్లిలో అనధికార బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన ప్రమాదంలో ఆరుగురు మృత్యువాతపడ్డారు. జిల్లా పునర్విభజన తరువాత 2022 జూన్‌లో సబ్బవరం మండలం ఆరిపాకలో అనధికార బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు సంభవించి నలుగురు మృతిచెందగా, ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. అనుమతులున్న వాటితో పాటు, అనధికార బాణసంచా తయారీ కేంద్రాల్లో భద్రతా చర్యలు శూన్యమనేది బహిరంగ రహస్యం. వీటిలో ప్రమాదాలు సంభవిస్తున్నా బయటకు పొక్కనీయడం లేదు.

### ప్రతి కుటుంబానిదీ ఓ దీనగాథ

కోటవురట్ల/ నర్సీపట్నం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కైలాసపట్నంలోని బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడులో మృతిచెందిన వారి కుటుంబాల్లో ఒక్కొక్కరిది ఒక్కో గాథ. ప్రమాదంలో మృతిచెందిన దాడి రామలక్ష్మి ఒంటరిగా జీవిస్తున్నది. ఆరేళ్ల క్రితం భర్త చనిపోయాడు. కుమార్తె ధనలక్ష్మికి గతంలోనే వివాహమైంది. ఆమె ఎలమంచిలి మండలం జంపపాలెంలో వుంటున్నది. మరో మృతుడు గంపెన వేణుకి భార్య భవాని, కూతురు, కొడుకు ఉన్నారు. గుర్తు పట్టలేనంతగా వేణు మృతదేహం కాలిపోయింది. మొదట్లో చేనేత కార్మికుడిగా పని చేసేవాడు. ఆ వృత్తి కలిసి రాకపోవడంతో బాణసంచా తయారీ కేంద్రంలో కూలీగా వెళుతూ, ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. కైలాసపట్నం గ్రామానికి చెందిన పురం పాప భర్త చనిపోయి 10 సంవత్సరాలు అవుతున్నది. ఈమెకు ఇద్దరు పిల్లలు వున్నారు. బాణసంచా ప్రమాదంలో ఆమె చనిపోవడంతో పిల్లలు అనాథలయ్యారు. కైలాసపట్నం గ్రామానికి చెందిన సంగరాతి గోవిందకు భార్య, ఇద్దరు పిల్లలు పిల్లలు వున్నారు. ఆయన మృతితో కుటుంబం వీధిన పడింది.

## నేడు పీజీఆర్ఎస్ రద్దు

విశాఖపట్నం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా సెలవు కావడంతో సోమవారం జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్టు పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వచ్చే సోమవారం ప్రజల నుంచి యథావిధిగా ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. జీవీఎంసీలో జరిగే పీజీఆర్ఎస్‌ను కూడా రద్దు చేస్తున్నట్టు జీవీఎంసీ అదనపు కమిషనర్ రమణమూర్తి చెప్పారు.

### నేడు అంబేడ్కర్ జయంతి వేడుకలు

విశాఖపట్నం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోనూ సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్టు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎల్ఐసీ భవన కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించాక ఫుడ్‌కోర్టు సమీపంలో బహిరంగ సమావేశం ఉంటుందన్నారు. ఈ సమావేశానికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఇతర అధికారులు హాజరుకానున్నట్టు చెప్పారు.

### 'పదవీ విరమణ వయసు నిర్ణయం సరైనది కాదు'

విశాఖపట్నం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : నాగార్జున విశ్వవిద్యాలయంలో కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ల పదవీ విరమణ వయసుపై యూనివర్సిటీ యాజమాన్యం విడుదల చేసిన ఉత్తర్వులు సరైనవి కాదని ఏపీ ఫెడరేషన్ ఆఫ్ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (కాంట్రాక్ట్) రాష్ట్ర అధ్యక్షుడు కోడి అర్జునుడు అన్నారు. నాగార్జున వర్సిటీలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను 60 ఏళ్లకే పదవీ విరమణ చేయాలంటూ ఆదేశాలు ఇవ్వడంపై అభ్యంతరం వ్యక్తం చేసిన అసోసియేషన్ సభ్యులు, దీనిపై ఆదివారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీలు గాదె శ్రీనివాసులునాయుడు, వేపాడ చిరంజీవిరావు తదితరులను కలిసి వినతి పత్రాలు ఇచ్చారు. 25 ఏళ్లుగా తక్కువ వేతనాలతో వర్సిటీల్లో పనిచేస్తున్న ఉద్యోగులను ఇబ్బందులు పెట్టకుండా చూడాలన్నారు. వర్సిటీలో పనిచేసే వారి పదవీ విరమణ వయసు 62 నుంచి 65 ఏళ్లకు పెంచారని, కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసే వారికి కూడా వర్తింపజేయాలని కోరారు.

### సత్ప్రవర్తనతో మెలగండి

సీతమ్మధార, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని ద్వారకానగర్, నాలుగో పట్టణ సీఐలు రమణ, ఏ.సత్యనారాయణ హెచ్చరించారు. ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐలు మాట్లాడుతూ ఎటువంటి చట్టవ్యతిరేక పనులకు పాల్పడరాదని సూచించారు. సమాజంలో మంచి మనుషులుగా జీవించాలని హితవు పలికారు.

## రాజ్యాంగ పరిరక్షణకు ఐక్యంగా పోరాడాలి

### సినీనటుడు ఆర్.నారాయణమూర్తి

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణకు ఐక్యంగా పోరాడాలని సినీనటుడు ఆర్.నారాయణమూర్తి పిలుపునిచ్చారు. ఆదివారం కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం, ప్రజానాట్యమండలి విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డా.బి.ఆర్.అంబేడ్కర్ 134వ జయంతి సందర్భంగా డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో రాజ్యాంగ పరిరక్షణ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై అంబేడ్కర్, జ్యోతిరావుపూలే, హష్మీ, బాబు జగ్జీవన్‌రామ్‌ల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు బలహీనవర్గాల తరపున పోరాడే గొప్ప వ్యక్తుల నుంచి పోరాటస్ఫూర్తిని అందిపుచ్చుకోవాలని నారాయణమూర్తి అన్నారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు లోకనాథం మాట్లాడుతూ దళితులు, మైనార్టీలు. కవులు, కళాకారులపై కేంద్రం దాడులు చేయిస్తోందన్నారు. కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్రా మాల్యాద్రి, పీఎన్ఎం జిల్లా అధ్యక్షుడు జి.రమణ, జిల్లా కార్యదర్శి టి.చిరంజీవి తదితరులు మాట్లాడారు. ఈ సభలో పీఎన్ఎం జిల్లా కార్యదర్శి ఎం.చంటి, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు. తొలుత నిర్వహించిన ర్యాలీలో రాజ్యాంగ పరిరక్షణ నాటిక..బాలబాలికల నృత్య ప్రదర్శనలు అలరించాయి.


ర్యాలీలో పాల్గొన్న ఆర్.నారాయణమూర్తి, ఇతర సభ్యులు

## ఉచిత వైద్య శిబిరాలకు స్పందన

మురళీనగర్/అక్కయ్యపాలెం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 50వ వార్డు మురళీనగర్ సెక్టార్-4లో ఆదివారం వార్డు, నివాస్ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య సేవల శిబిరానికి విశేష సంఖ్యలో జనం విచ్చేశారు. సాధారణ రుగ్మతల నుంచి నేత్ర, దంత పరీక్షలు, స్త్రీల క్యాన్సర్ వ్యాధులకు మెడికవర్ వైద్యుల సాయంతో శిబిరం నిర్వహించారు. మురళీనగర్ సెక్టర్-4లోని ప్రశాంతి స్పిరిట్యువల్ పార్క్ వేదికగా జరిగిన కార్యక్రమంలో ఎండలోనూ పలు ప్రాంతాల ప్రజలు చేరుకున్నారు. వైద్య పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు పొందారు. అక్కయ్యపాలెం సచివాలయం సమీపంలోని మద్రస సల్మాన్ ఫార్సీ ఆవాజ్ మైనార్టీ డెవలప్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ అబ్దుల్ రెహ్మాన్ మెమోరియల్ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది వచ్చి వివిధ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. వైద్యులు సదాఫ్ ఖనాం, బిలాల్ రెహ్మాన్, భార్గవ్, మద్రస సల్మాన్ ఫార్సీ లిల్బనాత్ అధ్యక్షుడు అబ్దుల్ రెహ్మాన్, ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు మొహ్మద్ అయూబ్, కార్యదర్శి అష్రఫ్, అబ్దుల్ మునీర్, ముషహద్ తదితరులు పాల్గొన్నారు.



అక్కయ్యపాలెంలో వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

### నీలమ్మ వేపచెట్టు వద్ద నేడు రక్తదాన శిబిరం

అల్లిపురం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం జీవీఎంసీ 33వ వార్డులోని నీలమ్మ వేపచెట్టు వద్ద జీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు బి.గోపీకృష్ణ, ఆకుల రాజు తెలిపారు. యువత రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని కోరారు.

## ఉత్సాహంగా ఏపీ స్పోర్ట్సు హాస్టలర్స్ సమ్మేళనం

విశాఖపట్నం స్పోర్ట్సు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని స్పోర్ట్సు హాస్టలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రీయూనియన్ ఆదివారం బీచ్‌రోడ్డులో జరిగింది. వివిధ స్పోర్ట్సు హాస్టళ్లలో 1980 నుంచి 2003 వరకు శిక్షణ పొంది వివిధ క్రీడాంశాలలో అంతర్జాతీయ, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించడమే కాకుండా స్పోర్ట్సు కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు పొందినవారు, వివిధ రంగాల్లో ఉన్నత స్థాయిలో ఉన్న మాజీ క్రీడాకారులు విచ్చేసి గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి అంతర్జాతీయ మాజీ వాలీబాలర్, ఎమ్మెల్యే గణబాబు ముఖ్య అతిథిగా హాజరై తన క్రీడా అనుభవాలను గుర్తు చేసుకున్నారు. క్రీడా రంగంలో, ప్రభుత్వ క్రీడా విధానంలో వచ్చిన మార్పులు, సాంకేతికత, ఇతర అంశాలను ఆయన విశ్లేషించారు. ఈ సందర్భంగా సీనియర్ కోచ్ ఖాసీంతోపాటు డాక్టరేట్ సాధించిన క్రీడాకారులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష కార్యదర్శులు వెంకటేశ్వరరెడ్డి, రామిరెడ్డి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎఫ్ఆర్ఎస్‌కు మస్కా

... 5వ పేజీ తరువాయి

డాక్టర్ కోటకల అనూష, చినవాల్తేరు పట్టణ ఆరోగ్య కేంద్రంలో పనిచేసే డాక్టర్ సాయి మోహిని ఉన్నారు.

వీరితోపాటు పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో కొందరు సిబ్బంది ముఖ ఆధారిత హాజరులో మోసానికి పాల్పడినట్టు ప్రభుత్వం గుర్తించింది. వీరిలో నగర పరిధి అంబేడ్కర్ కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రంలో పనిచేసే ఎస్‌పీఎల్ ప్రవీణ, మధురవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసే పసుపుల దీపిక, కొమ్మాది పట్టణ ఆరోగ్య కేంద్రంలో పనిచేసే గోసాల సాల్మన్‌రాజు, ఎంఎస్ఆర్ లేఅవుట్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో పనిచేసే డి.సాహిత్య, ఆర్పీపేట పట్టణ ఆరోగ్య కేంద్రంలో పనిచేసే మాట్టాశశి ప్రియాంక, రామ్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో పనిచేసే ఉయ్యాల కార్తీక్ ఉన్నట్టు గుర్తించింది. ఈ జాబితాను జిల్లా ఆరోగ్యశాఖ అధికారులకు పంపింది. దీంతో వీరిపై శాఖాపరమైన చర్యలు తీసుకునేందుకు యంత్రాంగం సిద్ధమవుతోంది. తొలుత వీరికి షోకాజ్ నోటీసులు జారీ చేసి, వివరణ తీసుకోవాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందినట్టు తెలిసింది. అనంతరం చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. ఎఫ్ఆర్ఎస్‌ను ఎలా ట్యాంపరింగ్ చేశారు, ఎందుకు చేశారన్న దానిపై వివరణ తీసుకుంటామన్నారు.

### రాష్ట్ర స్థాయిలో మానిటరింగ్

ప్రభుత్వశాఖల్లో అమలుచేస్తున్న ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని రాష్ట్రస్థాయి నుంచే మానిటరింగ్ చేస్తున్నారు. అక్కడి నుంచే పర్యవేక్షిస్తున్న అధికారులు ఉద్యోగుల సమయ పాలనను అంచనా వేస్తున్నారు. గత కొన్నాళ్లుగా భిన్నమైన పద్ధతులను అనుసరిస్తూ హాజరు వేస్తున్న సిబ్బందిని గుర్తించిన ప్రభుత్వం, జాబితాను జిల్లా యంత్రాంగానికి పంపింది. అన్ని శాఖల్లోనూ పూర్తిస్థాయిలో ఎఫ్ఆర్ఎస్‌ను పటిష్ఠంగా అమలు చేయడంతో ఉద్యోగుల పనితీరును మెరుగు పరచవచ్చనే భావనలో ప్రభుత్వం ఉంది.

## ఆక్రమణలకు మార్కింగ్!

... 5వ పేజీ తరువాయి

సీపీని సంప్రతించి ట్రాఫిక్‌కు ఇబ్బందిలేకుండా దుకాణాల ఏర్పాటుకు అనుమతించాలని కోరినట్టు తెలిసింది. దీనికి సీపీ ససేమిరా అనడంతో జోనల్ కమిషనర్, కిందిస్థాయి పోలీసు అధికారులకు ఫోన్‌చేసి దుకాణాల ఏర్పాటుకు మార్కింగ్ చేయాలని, లేదంటే దగ్గరుండి దుకాణాలు పెట్టిస్తామని బెదిరించినట్టు ప్రచారం జరుగుతోంది. దీంతో పోలీసులు పూర్ణామార్కెట్ రోడ్డులో పార్కింగ్ వెంబడి దుకాణాలు పెట్టుకునేందుకు వీలుగా మార్కింగ్ చేశారు. ఈ నేపథ్యంలో మార్కెట్‌లోని వ్యాపారులతోపాటు స్థానిక కార్పొరేటర్ అడ్డుకున్నారు. మార్కెట్‌లోపల ఉన్న వందలాది వ్యాపారులకు ఇబ్బందులు ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆశీలు కాంట్రాక్టరు రోడ్డుపై దుకాణాలు పెట్టించి, రోజుకు రూ.300 చొప్పున వసూలు చేసుకోవాలనే ప్రజాప్రతినిధులను తప్పుదారిపట్టిస్తున్నారని ఆరోపించారు. రోడ్డుపై దుకాణాలు పెట్టాలనుకునే వారికి మార్కెట్‌లో దుకాణాలున్నాయని, అక్కడ వద్దనుకుంటే జీవీఎంసీకి అప్పగించాలన్నారు. వేరొకరికి కేటాయిస్తారని చెప్పడంతో అధికారులు వెనుదిరిగారు. దీనిపై సీపీతోపాటు జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ హరేంధిరప్రసాద్ దృష్టిసారించాలని, రోడ్డుపై ఆక్రమణలకు అవకాశం లేకుండా ఆదేశాలివ్వాలని కోరుతున్నారు.

### వసూళ్లకు వ్యూహం

తొలగించిన దుకాణాలను తిరిగి పెట్టించడానికి చాలా ఖర్చుచేశామని, మార్కెట్‌లో దందా చేస్తున్న ఓ దళారీ వసూళ్లకు రంగం సిద్ధం చేసినట్టు తెలిసింది. పూర్ణామార్కెట్ ప్రధాన రహదారిలో దుకాణాలను పోలీసులు రెండు నెలల కిందట తొలగించగా, ఆశీలు వసూలు కాంట్రాక్ట్ దక్కించుకున్న వ్యక్తి ఈనెల ఒకటిన తిరిగి పెట్టించారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో మరోసారి కథనం ప్రచురితంకావడంతో రెండో తేదీన పోలీసులు దుకాణాలను తొలగించారు. ఈ క్రమంలో కూటమి నేతల పేరుతో జీవీఎంసీ, పోలీసుల వద్ద రుబాబు చేసి, దుకాణాలు పెట్టించేందుకు మార్కింగ్ చేయించారు. ఈ మేరకు ఆదివారం 130 మంది వ్యాపారులతో రామకృష్ణ రైతుబజార్‌లో సమావేశం నిర్వహించారు. సోమవారం నుంచి మార్కెట్ రోడ్డులో దుకాణాలను పెట్టిస్తానని, జీవీఎంసీ, పోలీసు అధికారులకు భారీగా ముట్టజెప్పాల్సి ఉంటుందని, ఆ వివరాలను చెబితే లీకై, 'ఆంధ్రజ్యోతి'లో వార్తలు వచ్చేస్తున్నాయి కాబట్టి, పదిరోజుల తర్వాత చెబుతానన్నాడని సమాచారం. ఇదంతా పోలీసులు, జీవీఎంసీ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని వ్యాపారులు ఆరోపిస్తున్నారు.

## ఆరు గంటలు ఉత్కంఠ!

... 5వ పేజీ తరువాయి

పిల్లలిద్దరూ సెల్లార్ పక్కన ఖాళీ స్థలంలోని ఇసుకలో ఆడుకుంటున్నారు. కేశవరావు సమీపంలో అపార్టుమెంట్ వాచ్‌మన్‌తో మాట్లాడుతున్నాడు. చీకటి పడడంతో పిల్లలను తీసుకువెళ్లేందుకు రాగా, రుగేశ్వరిశ్రీ కనిపించలేదు. పెద్దపాపను ఆరాతీయగా తెలియదని చెప్పడంతో ఆందోళన చెందారు. బంధువులు, స్నేహితులతో కలిసి వెతికినా ఫలితం దక్కలేదు. దీంతో డయల్ 112కు కాల్ చేయడంతో పెందుర్తి సీఐ కేవీ సతీశ్‌కుమార్, సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకున్నారు. అపార్ట్‌మెంట్ సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించినా ఆధారాలు లభించలేదు. దీంతో కిడ్నాప్ కోణంలో విచారణ చేపట్టారు. అపార్ట్‌మెంట్‌కు కొద్దిదూరంలో చెరువు ఉండడంతో డ్రోన్‌లను రంగంలోకి దింపారు.

### వీడిన ఉత్కంఠ..

డ్రోన్ కెమెరాలో పసిపాప జాడ కనిపించింది. లోకేషన్ అంతుచిక్కలేదు. దీంతో పోలీసులు టార్చిలైట్లు, ద్విచక్రవాహనాల వెలుగులో జల్లెడ పట్టారు. ఎట్టకేలకు చెరువు సమీపంలోని మట్టిలో పాపను గుర్తించారు. క్షేమంగా తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. రాత్రి ఏడు గంటలకు అదృశ్యమైన పాప ఆచూకీ అర్ధరాత్రి ఒంటి గంటకు లభించడంతో ఆరు గంటల ఉత్కంఠకు తెరపడింది. ఆడుకుంటూ చిన్నారి చెరువు వద్దకు వెళ్లిపోయిందని, మట్టిలో కూరుకుపోవడంతో బయటకు రాలేకపోయిందని సీఐ తెలిపారు.


చిన్నారిని తండ్రికి అప్పగిస్తున్న సీఐ

## సేవా కార్యక్రమాలతో ప్రజలకు చేయూత



అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ విశాఖపట్నం డిస్ట్రిక్ట్ 105 గవర్నర్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న అట్లూరి ఉషారాణి

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు చేయూత అందించవచ్చని అలయన్స్ అంతర్జాతీయ అధ్యక్షుడు రాజ్‌కుమార్ సక్సేనా అన్నారు. ఆదివారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలోని అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ విశాఖపట్నం డిస్ట్రిక్ట్ 105 ఎన్నికలు నిర్వహించారు. వ్యవస్థాపకుడు బి.తిరుపతిరాజు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. గవర్నర్‌గా అట్లూరి ఉషారాణితో ప్రమాణ స్వీకారం చేయించారు. రాజ్‌కుమార్ సక్సేనా ముఖ్య అతిథిగా మాట్లాడుతూ ప్రతి సభ్యుడు సేవకు స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. బి.తిరుపతిరాజు మాట్లాడుతూ స్వదేశీ సేవా సంస్థగా గుర్తింపు పొందిన అలయన్స్ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలని కోరారు. ప్రమాణ స్వీకారం అనంతరం గవర్నర్ అట్లూరి ఉషారాణి మాట్లాడుతూ నిస్వార్థంగా సేవ చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. వీడీజీ 2 సీహెచ్ కాశీవిశ్వనాథన్, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ కార్యదర్శి కె.శ్రీనివాస్, కోశాధికారి సీహెచ్.వందన, పీఆర్ఓ జె.అనురాధ , నగరానికి చెందిన వివిధ అలయన్స్ శాఖల సభ్యులు పాల్గొన్నారు. 2024-25లో జిల్లాస్థాయిలో మంచి సేవా కార్యక్రమాలు నిర్వహించిన వివిధ శాఖల కార్యవర్గ సభ్యులకు అవార్డులు అందజేశారు.

## నాడీ వ్యవస్థకు వ్యాయామమే కీలకం



పార్కిన్‌సన్ వ్యాధిపై అవగాహన ర్యాలీ చేపడుతున్న నిర్వాహకులు

మాధవధార, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): శారీరక, మానసిక వ్యాయామం నాడీ వ్యవస్థ పనితీరుకు దివ్య ఔషధంగా పనిచేస్తాయని ప్రముఖ న్యూరాలజిస్ట్ కె.వెంకటేశ్వరులు సూచించారు. ఆదివారం మురళీనగర్ వాకర్స్ హెల్త్ క్లబ్ 20వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన పార్కిన్‌సన్ వ్యాధి నివారణ మార్గాలు, అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మనిషి వణుకుడు జబ్బుకు గురవడాన్ని పార్కిన్‌సన్‌గా పరిగణిస్తామని పేర్కొన్న ఆయన, నాడీ కణాలు మెదడును దెబ్బతీయడం ద్వారా ఈ వ్యాధి వస్తుందని తెలిపారు. కండరాలు బిగుసుకుపోవడం, వణుకు రావడం వల్ల సాధారణ రోజువారీ పనులను కూడా ఈ వ్యాధిగ్రస్తులు నెమ్మదిగా చేస్తారని అన్నారు. వారి మాటల్ని, చేతి రాతల్ని కూడా ఈ వ్యాధి దెబ్బతీస్తుందన్నారు. వాకర్స్ హెల్త్ క్లబ్ ఇలాంటి వ్యాధుల నిర్మూలన దిశగా స్పందించడం మంచి పరిణామమన్నారు. క్లబ్ అధ్యక్షుడు సి.హెచ్.శ్రీనివాసరాజు సేవా కార్యక్రమాల్ని వివరించారు. అనంతరం హరిత పార్కు నుంచి అవగాహన ర్యాలీ చేపట్టారు.

## హనుమత్ సీతారామలక్ష్మణులకు వెండి కిరీటాలు



వెండి కిరీటాలతో విగ్రహాలు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : విశాలాక్షినగర్‌లోని సంజయ్‌నగర్ కాలనీలో వేంచేసి ఉన్న రామాలయంలోని హనుమత్ సీతారామలక్ష్మణులకు భక్తుడు అనిల్‌కుమార్ రాజు వెండి కిరీటాలను బహూకరించారు. ఇటీవల జరిగిన సీతారాముల కల్యాణ మహోత్సవాల సందర్భంగా ఈ వెండి కిరీటాలను నెహ్రూ యువజన సేవా సంఘం వారికి అందజేశారు. సంఘం ఆధ్వర్యంలో శనివారం వెండి కిరీటాలను దేవతామూర్తులకు అలకరించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు నల్ల రవికుమార్ మాట్లాడుతూ ఈ నెల 15న పోలమాంబ అమ్మవారి జాతర, 18న ఆలయ వార్షికోత్సవం వేడుకలను ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్యశాస్త్రి సారధ్యంలో నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆరోజు మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమం కూడా ఉంటుందన్నారు.

## పలు రైళ్లు మళ్లింపు

» రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ రద్దు

విశాఖపట్నం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : ఖుర్దారోడ్డు డివిజన్ పరిధిలో నాన్ ఇంటర్ లాకింగ్ పనులు జరుగుతున్నందున పలు రైళ్లను మళ్లింపు మార్గంలో నడిపిస్తున్నట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. అలాగే రౌర్కెలా-గుణుపూర్ మధ్య రాకపోకలు సాగించే రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ రైళ్లను(18117/18118) ఈ నెల 14 నుంచి 23 వరకు రద్దు చేశామని పేర్కొన్నారు.

రైళ్ల దారి మళ్లింపు: విశాఖ-అమృతసర్ హిరాకుద్ ఎక్స్‌ప్రెస్ (20807) ఈ నెల 18, 19, 22 తేదీల్లో విజయనగరం, టిట్లాగర్, బొలంగీర్, సంబల్‌పూర్, ఝార్సుగుడ మీదుగా...అమృతసర్-విశాఖ హిరాకుద్ ఎక్స్‌ప్రెస్ (20808) ఈ నెల 16, 19, 20 తేదీల్లో ఝార్సిగుడ, సంబల్‌పూర్, బొలంగీర్, టిట్లాగర్, విజయనగరం మీదుగా నడుస్తాయి. ఈ నెల 15 నుంచి 23 వరకు భువనేశ్వర్-ఎల్‌టీటీ-భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్ (12880/12879), పూరి-ఎల్‌టీటీ-పూరి ఎక్స్‌ప్రెస్ (22866/22865), పూరి-అజ్మీర్-పూరి ఎక్స్‌ప్రెస్ (20823/20824)), సూరత్-పూరి-సూరత్ (22828/22827), పూరి-అహ్మదాబాద్-పూరి ఎక్స్‌ప్రెస్ (20861/20862) రైళ్లు టిట్లాగర్, విజయనగరం మీదుగా రాకపోకలు సాగిస్తాయన్నారు.

## భక్తిశ్రద్ధలతో మట్టల పండుగ

ఆరిలోవ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : మట్టల ఆదివారం సందర్భంగా ఆరిలోవ ప్రాంతంలో ఏసు విశ్వాసకులు ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ కీర్తనలు ఆలపిస్తూ వీధుల్లో తిరిగారు. ఈత మట్టలకు పూలను అలంకరించి పలు ప్రాంతాల్లో ఊరేగింపు చేపట్టారు.

## సినిమా గైడ్

● గుడ్, బ్యాడ్, అగ్లీ : శ్రీవెంకటేశ్వర, సంగం, నరసింహ (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం) అరుణ (పెదగంట్యాడ)
● జాక్ : జగదాంబ, శ్రీకన్య, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం),
● రాబిన్‌హుడ్ : శ్రీలీలామహల్, గోకుల్,
● మ్యాడ్ : జగదాంబ, శరత్, కన్య (గాజువాక)
● పెళ్ళికాని ప్రసాద్ :శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), వర్మ (గోపాలపట్నం), తాతా(తగరపువలస)
కోర్ట్ : జగదాంబ, మినీ మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

## రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 20, టమాటా 17, వంకాయలు (తెలుపు) 18, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 30, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 34, బీరకాయలు 42, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 18, క్యాబేజి 12, క్యారెట్ 28 దొండకాయలు 22, బంగాళ దుంపలు 17, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 34,అల్లం (పాతది) 48, బరబాటి 26,ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 62, దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 52, కీరదోస 24, కాప్సికమ్ 46, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 28 చిలగడదుంపలు 36, కంద 64, దేముడుచిక్కుడు 64, గోరుచిక్కుడు 38, కూరపెండలం 26, బ్రకోలి 45, పనస పొట్టు200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 50, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 48, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

**కోడిగుడ్లు (నెక్)**

(వంద - రూ.లలో)

| | |
|---|---|
| విశాఖపట్నం | 415 |
| విజయనగరం | 419 |
| శ్రీకాకుళం | 419 |

**చికెన్ ధరలు**

బ్యాగ్

| | |
|---|---|
| రైతు ధర | 110 |
| లైవ్ ధర | 130 |
| విత్ స్కిన్ | 230 |
| స్కిన్‌లెస్ | 240 |

# నిర్లక్ష్యానికి మూల్యం

» కాలువలో పూడిక తొలగించకపోవడంతో వర్షానికి వీధుల్లోకి మురుగు
» ఇసుకతోట పెట్రోల్ బంకు సమీపంలో ఇళ్లల్లోకి చొచ్చుకురావడంతో స్థానికుల ఇబ్బందులు
» తాపీగా నష్ట నివారణ చర్యలు చేపట్టిన అధికారగణం
» జీవీఎంసీ ఇంజినీరింగ్ తీరుపై విమర్శల వెల్లువ



ఇసుకతోట పెట్రోలు బంకు వద్ద పనులు నిర్వహిస్తున్న దృశ్యం

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పారిశుధ్య విభాగం తీరుకు ఇదో నిదర్శనం. వర్షాలు లేనప్పుడు ప్రతి కాలువ, గెడ్డ వంటివి పూడిక తొలగించి, నీటి ప్రవాహానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా చూసుకోవాలి. కానీ పై అధికారుల పర్యవేక్షణ కొరవడంతో కిందిస్థాయి సిబ్బంది పెద్దగా పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. దీంతో కింది స్థాయి సిబ్బంది 'ఏదో అయిందనిపించేలా' పనులు చేసి వదిలేస్తున్నారు. కొద్ది రోజుల క్రితమే పూడిక తొలగించి, తరలించకుండా పక్కనే గుట్టగా వదిలేశారు. దీనిపై కథనం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చింది. అయినప్పటికీ అధికారులు స్పందించలేదు.

మూడు రోజుల క్రితం ఆకస్మికంగా కురిసిన వర్షానికి ఇసుకతోట పెట్రోలు బంకు సమీపంలో రోడ్డు మునిగిపోయింది. అలాంటి పరిస్థితి గతంలో ఎప్పుడూ లేదు. గెడ్డ, కాలువల్లోని మురుగునీరు బయటకు వచ్చేసింది. రోడ్డును ఆనుకుని ఉన్న భవనాల్లోకి మురుగునీరు చొచ్చుకెళ్లింది. ఓ మిఠాయి దుకాణం కట్టేసి ఉండడంతో లోపలకు వచ్చిన వరదకు సుమారు మూడు లక్షల రూపాయల విలువైన ఆహార పదార్థాలు పాడయ్యాయి. ఈ రోడ్డు పక్కన ఉన్న దుకాణాలే కాకుండా, ఆ వెనుక ఉన్న ఇళ్లల్లోకి కూడా మురుగు నీరు చేరింది. అక్కడే ఓ శాశనసభ్యుడి నివాసం కూడా ఉంది. వారింట్లోకి కూడా నీరు వెళ్లిపోవడంతో జీవీఎంసీ అధికారులపై సదరు ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. దీంతో పరుగున వచ్చిన అధికారులకు అక్కడేం జరిగిందో ఓ పట్టాన అర్థం కాలేదు. తర్వాత చూస్తే పెట్రోలు బంకు ముందు ఉన్న ప్రధాన కాలువలో చెత్తాచెదారం అడ్డుపడి, నీటి ప్రవాహం ఆగిపోయింది. ఇప్పుడు దానిని సరిచేసే పనిలో భాగంగా పొక్లెయిన్‌తో తవ్వుతున్నారు. అయితే ఇక్కడ అడ్డు తొలగించినంతటే ముప్పు తొలగిపోయే అవకాశం లేదని, ఇంజనీరింగ్ అధికారులు అంటున్నారు. ఈ కాలువ ప్రధాన రహదారి కింద నుంచి ప్రవహిస్తోంది. ఆ కింద పరిస్థితి ఎలా ఉందో తెలీదు. ఈ కాలువలోకి శివాజీ పార్కు పరిసర ప్రాంతాల నుంచి వచ్చే మురుగునీరు ఇసుకతోట, ఐసీఐసీఐ కూడలి వరకూ రోడ్డు కింది నుంచి ప్రవహించి, లాసన్స్‌బే వరకూ వెళుతుంది. ప్రస్తుతం పెట్రోలు బంకు వద్ద తవ్విన మట్టే భారీగా వచ్చింది. ఈ సమస్య వల్ల బంకులో సగం మట్టితో నిండిపోయింది.

ఎప్పటికప్పుడు పూడికలు తొలగించకపోవడంతో ఆకస్మికంగా వర్షం పడినప్పుడు కాలువల్లో ప్రవాహం ఆగిపోయి, బయటకు మురుగు వచ్చేస్తోంది. ప్రస్తుతం చేస్తున్న పనుల వల్ల తాత్కాలికంగా ప్రవాహానికి అడ్డు తొలగినా, ప్రధాన రహదారి కింద పరిస్థితి ఏమిటో ఇప్పుడే చూడకపోతే మళ్లీ ముప్పు తప్పకపోవచ్చని ఇంజనీరింగ్ వర్గాలు అంటున్నాయి. పూడికలు సరిగ్గా తీయకపోవడం, తీసిన పూడిక గుట్టలు తరలించకపోవడం వల్ల ముంపు ముప్పు ఉంటుందనడంలో సందేహం లేదు.

## ఘనంగా వేంకటేశ్వరస్వామి సామూహిక వ్రతాలు



సామూహిక వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి) : తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీ టీటీడీ కళ్యాణమండపంలో ఆదివారం నిర్వహించిన శ్రీ వేంకటేశ్వరస్వామి వ్రతానికి భక్తులు భారీగా హాజరయ్యారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి పన్నెండు గంటల వరకూ నిర్వహించిన పూజా కార్యక్రమంలో భక్తులకు తిరుపతి దేవస్థానం ద్వారా పూజా సామగ్రిని ఉచితంగా అందించారు. జిల్లా ధార్మిక కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కూచిపూడి, భరతనాట్యం, సంకీర్తనల వంటి సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ప్రదర్శించారు. తిరుమల దేవస్థానం వేద పండితులు వేద పారాయణం నిర్వహించారు. అన్నమయ్య సేవా సంస్థ సభ్యులు, వివిధ ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంస్థలు సహకారం అందించాయి. సుమారు వెయ్యి మంది భక్తులు పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు.

## ఘనంగా మట్టల పండుగ



మట్టలు చేతపట్టి గీతాలు ఆలపిస్తున్న క్రైస్తవులు

అక్కిరెడ్డిపాలెం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : గుడ్ ఫ్రైడే ముందు ఆదివారం క్రైస్తవులు నిర్వహించే మట్టల ఆదివారం సందర్భంగా 68, 69 వార్డుల పరిధిలోని క్రైస్తవ మందిరాలలో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. షీలానగర్ లోని హయ్యర్ మెమోరియల్ లూథరన్ చర్చితో పాటు సీయోను ప్రార్థనామందిరాలకు చెందిన పిల్లలతో పాటు పెద్దలు ఈత మట్టలకు రంగురంగుల పూలు గుచ్చి కాలనీలో క్రీస్తు గీతాలను ఆలపిస్తూ మట్టల ఆదివారం నిర్వహించారు. బీహెచ్‌పీవీ, తుంగ్లాం కాలనీలలోని చర్చిల్లో కూడా మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు.

## దుర్గానగర్‌లో ఉచిత నేత్ర వైద్య శిబిరం



కళ్లద్దాలను అందజేస్తున్న సీపీఐ నాయకులు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : సీపీఐవంద సంవత్సరాల వార్షికోత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 15వ వార్డు దుర్గానగర్ లో అపోలో క్లినిక్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 140 మంది దుర్గానగర్ కొండవాలు ప్రాంత ప్రజలకు ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి సీపీఐ తూర్పు నియోజకవర్గం కార్యదర్శి ఎస్.కె.రెహ్మాన్ చేతుల మీదుగా కంటి అద్దాలు, మందులు అందజేశారు.

## ప్రేక్షకుల స్పందన ఆనందం కలిగిస్తోంది

» 'అక్కడ అమ్మాయి..ఇక్కడ అబ్బాయి' చిత్ర హీరో ప్రదీప్ మాచిరాజు




సమావేశంలో మాట్లాడుతున్న ప్రదీప్ మాచిరాజు

మహారాణిపేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రేక్షకుల పెదవులపై చిరునవ్వులే మాకు సంతోషం కలిగిస్తుందని 'అక్కడ అమ్మాయి..ఇక్కడ అబ్బాయి' సినిమా హీరో ప్రముఖ యాంకర్ ప్రదీప్ మాచిరాజుఅన్నారు. ప్రదీప్, దీపికా పిల్లి హీరో హీరోయిన్లుగా నితిన్ భరత్ దర్శకత్వంలో రూపొందించిన ఈ చిత్రం ఇటీవల విడుదలై విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా ఆదివారం చిత్ర యూనిట్ విశాఖలో సక్సెస్ టూర్ నిర్వహించింది. దసపల్లా హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో హీరో ప్రదీప్ మాట్లాడుతూ ఈ చిత్రానికి సపోర్టు చేసిన హీరోలు మహేష్‌బాబు, రామ్‌చరణ్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రేక్షకుల ఎలా ఆదరిస్తున్నారో తెలుసుకునేందుకు నగరంలో వివిధ థియేటర్లకు వెళ్లి చూశామని, ఈ సినిమా ఆద్యంతం ప్రేక్షకులు నవ్వుకుంటుండడం చాలా సంతోషం కలిగించిందన్నారు. ఇలాంటి క్లీన్ కామెడీ ఎంటర్‌టైన్‌మెంట్ చూసి చాలారోజులైనట్లు ప్రేక్షకులు చెప్పారన్నారు. ఈ సినిమా కోసం శ్రమించిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

హీరోయిన్ దీపికా మాట్లాడుతూ ప్రేక్షకులు ఈ సినిమాను ఇంతలా ఆదరించటం చాలా ఆనందం కలిగించిందని అన్నారు. ఈ సమావేశంలో దర్శకుడు నితిన్ భరత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

**'పశ్చిమ' ఎమ్మెల్యే గణబాబు**




మాట్లాడుతున్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

బీచ్ రోడ్డు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : క్రీడారంగంలో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, క్రీడాకారులు ఎప్పుడూ క్రీడా స్ఫూర్తితో మెలగి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని పశ్చిమ నియోజకవర్గం శాసనసభ సభ్యులు పి.గణ బాబు పేర్కొన్నారు. ఆదివారం బీచ్ రోడ్డు వద్ద ఉన్న అంబికా శ్రీగ్రీన్ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ. క్రీడాకారులకు ఇతరులతో కలిసి లక్ష్యాలను సాధించే నైపుణ్యం అవసరమన్నారు. క్రీడారంగంలో వస్తున్న మార్పులకు తగినట్టుగా యువత నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. క్రీడాకారులు కాలానుగుణంగా కొత్త నైపుణ్యాలను నేర్చుకోవాలన్నారు. ప్రతి క్రీడాకారుడు నేర్చుకోవాలనే తపన, ఆసక్తితో ముందుకు సాగాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడాకారులకు నిధులు సమకూర్చడమే కాకుండా భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని వసతులు సమకూరుస్తాయన్నారు. అనంతరం ప్రతిభ కనబరచిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ కోటేశ్వరరావు, క్రీడాకారులు గోపినాథ్, రవికుమార్, రమేష్‌కుమార్, ఎన్.రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఆందోళనకరంగా విద్యా ప్రమాణాలు

» ఆలిండియా డెమోక్రటివ్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ నగర అధ్యక్షుడు అభిలాష్

వెంకోజీపాలెం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో విడుదలైన ఇంటర్మీడియేట్ ఫలితాలు ఆధారంగా ప్రభుత్వ కళాశాలలో విద్యా ప్రమాణాలు క్షీణిస్తున్నాయన్న విషయం స్పష్టమవుతోందని ఆల్ ఇండియా డెమోక్రటివ్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ నగర అధ్యక్షుడు కె.అభిలాష్ ఆదివారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కళాశాలలో ఉత్తీర్ణత శాతం గణనీయంగా పడిపోవడానికి ప్రభుత్వ రంగ విద్యను దెబ్బ తీయడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలే ప్రధాన కారణమని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్ విద్యను మెరుగుపరుస్తామని గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ.. ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలలో ఉపాధ్యాయ, అధ్యాపక, నాన్-టీచింగ్ పోస్టులను శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయకపోవడమే విద్యా ప్రమాణాలను తీవ్రంగా దెబ్బ తీస్తోందన్నారు. సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని, ఇది విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తోందన్నారు. అంతేకాకుండా పాఠశాల స్థాయి నుంచి పాస్/ ఫెయిల్ విధానం లేకపోవడం విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పడిపోవడానికి మరో ముఖ్య కారణమన్నారు. ఉపాధ్యాయుల్లో అంకితభావం, విద్యార్థులలో ఆసక్తి, తపన కొరవడుతోందన్నారు. చదవకపోయినా ఉత్తీర్ణత సాధించవచ్చనే దురభిప్రాయం విద్యార్థుల్లో నెలకొనడంతో వారిలో అశ్రద్ధ పెరుగుతోందన్నారు. ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలల్లోని అన్ని ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. పాఠశాల స్థాయి నుంచి పాస్/ ఫెయిల్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసే ప్రైవేటీకరణ విధానాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

## అంగరంగ వైభవంగా దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ పెద్దలు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : కొత్త వెంకోజీపాలెంలోని శ్రీ సమర్థ సద్గురు సాయినాథ్ ఆలయ ప్రాంగణంలో ఆదివారం ప్రతి శ్రీపంచనాగ సహిత, నాగబంధ సమేత శ్రీవల్లీ దేవసేన సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాలు, యంత్ర ప్రతిష్ఠ అంగరంగ వైభవంగా జరిగింది. వేద మంత్రాల నడుమ, మంగళవాయిద్యాల తోడ ప్రత్యేక అభిషేకాలతో దేవతామూర్తుల ప్రతిష్ఠను కన్నుల పండువగా నిర్వహించారు. గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొని దేవతామూర్తులను భక్తితో కొలిచారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి సూర్యప్రకాష్‌శర్మ, సుబ్రహ్మణ్యశాస్త్రి, ప్రభాకరశర్మ, కిశోర్ శర్మలు దేవతా మూర్తులకు ప్రత్యేక అభిషేకాలు జరిపి విఘ్నేశ్వర పూజతో ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం ఆలయం వద్ద మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు పీల కనకరాజు, ప్రధాన కార్యదర్శి కాళ్ల పోలినాయుడు, ఉపాధ్యక్షులు పీల నాగేశ్వరరావు, ఆడిటర్ కాండ్రేగుల నూకేష్, ఆలయ కమిటీ సభ్యులు బొడ్డేటి నర్సింగరావు, మద్దాల నరసింగరావు, సుంకరి నరసింహారెడ్డి, ద్రాక్షరపు నూకరాజు, బొడ్డేటి సూర్యనారాయణ, మద్దాల వీర వెంకట అప్పారావు, టీడీపీ నాయకులు బోర ధనరెడ్డి, కాళ్ల శంకర్, ఆడారి కామేశ్వరరావు పాల్గొన్నారు.

## అమ్మవారి జాతరకు ఎమ్మెల్యే వంశీకృష్ణకు ఆహ్వానం

మద్దిలపాలెం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : శివాజీపాలెంలో ఆదివారం పీతలవానిపాలెం గ్రామ దేవత చిన్న పోలమాంబ అమ్మవారి జాతర మహోత్సవాలకు హాజరుకావాలని కోరుతూ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్‌కు గ్రామ పెద్దలు ఆహ్వాన పత్రిక అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ ఏడాది చిన్న పోలమాంబ అమ్మవారి జాతర ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. పెద్దల ఆహ్వానం మేరకు వేడుకల్లో పాల్గొని తనవంతు సహాయసహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణ సేవాసంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ఇక రోజూ కేజీహెచ్‌లో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు

» మందుల పంపిణీలో పరిమితి
» వైద్యుల ప్రిస్క్రిప్షన్‌పై ఆడిట్
» ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్



వివరాలు వెల్లడిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్

మహారాణిపేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : కేజీహెచ్‌లో ఇకపై రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందుబాటులో ఉంటాయని సూపరింటెండెంట్ డాక్టర్ కె.శివానంద్ తెలిపారు. కార్డియాలజీ, న్యూరాలజీ, న్యూరోసర్జరీ, యూరాలజీ, పీడియాట్రిక్ సర్జరీ, గ్యాస్ట్రో, ఎండోక్రైన్, మెడికల్ అండ్ సర్జికల్ క్యాన్సర్, ప్లాస్టిక్ సర్జరీ తదితర 12 విభాగాలకు ఉదయం నుంచి సాయంత్రం వరకు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఆదివారం కేజీహెచ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పలు మార్పులను వివరించారు.

**పరిమితంగానే మందులు**

కేజీహెచ్‌లో మందుల కొరత లేకపోయినా.. కొందరు వైద్యులు రాస్తున్న ప్రిస్క్రిప్షన్ కారణంగా దుర్వినియోగం అవుతున్నాయనే కారణంతో పరిమితి విధించినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ తెలిపారు. కొన్ని విభాగాల వైద్యులు రోగికి వారం, పది రోజులకు రాయవలసిన యాంటీబయాటిక్స్, పారాసెట్‌మాల్ వంటి మందులను అధిక మోతాదులో ప్రిస్క్రిప్షన్ ఇవ్వడం వల్ల వృథా అవుతున్నాయని పేర్కొన్నారు. అధిక మోతాదులో మందులు వాడడం వల్ల రోగికీ నష్టమేనని, దీనిని దృష్టిలో ఉంచుకుని పరిమితి విధించినట్లు పేర్కొన్నారు. ఏ విభాగం నుంచి ఎక్కువ మోతాదులో మందులు రాస్తున్నారో గుర్తించి అక్కడ మాత్రమే పరిమితి విధించామని తెలిపారు. కేవలం జ్వరం, నొప్పులతో బాధపడేవారు సహా చిన్న చిన్న అనారోగ్య కారణాలతో వచ్చేవారికి అవసరం మందులు ఇస్తామన్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులకు, సూపర్ స్పెషాలిటీ వైద్య చికిత్సలు పొందేవారికి మందుల సరఫరాలో ఎలాంటి పరిమితి విధించలేదని స్పష్టంచేశారు. అలాంటి విభాగాల్లో వైద్యులు రోగి చికిత్సకు అవసరమైన మందులు యథాతథంగా సిఫార్సు చేయవచ్చన్నారు. మందులు దుర్వినియోగం కాకుండా వైద్యుల ఆడిట్ కమిటీ, ప్రిస్క్రిప్షన్ ఆడిట్ కమిటీలను నియమించినట్లు డాక్టర్ శివానంద్ వెల్లడించారు. వైద్యుల ప్రిస్క్రిప్షన్‌పై రెండు వారాలకు ఒకసారిఆడిట్ నిర్వహిస్తామన్నారు. సక్రమంగా మందులు అందించాలనే దృక్పథంతోనే ఈ పద్ధతి పాటించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వాసవీ లత, ఆర్ఎంవో డాక్టర్ మెహర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బాలికపై బాబాయ్ అసభ్య ప్రవర్తన

» పోలీసుల కళ్లుగప్పి నిందితుడు పరారీ

కంచరపాలెం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వరుసకు కుమార్తె అయిన బాలికపై బాబాయ్ అసభ్యంగా ప్రవర్తించిన ఘటన కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధి ధర్మానగర్‌లో ఆదివారం జరిగింది. రాములవారి వీధిలో ముగ్గురు కుమార్తెలతో దంపతులు నివాసం ఉంటున్నారు. ఉదయం తల్లిదండ్రులు పనిమీద బయటకు వెళ్లారు. ఆ సమయం చూసిన బాబాయ్ సురేష్ ఇంట్లోకి ప్రవేశించాడు. ఆ దంపతుల రెండో కుమార్తె దుస్తులు మార్చుకుంటుండగా సురేష్ లోనికి ప్రవేశించగా బాత్రూంలోకి వెళ్లి దాక్కుంది. అదే సమయంలో అక్కడే ఉన్న మరో ఇద్దరు కుమార్తెలు సురేష్‌ను అడ్డుకొనగా వారితో అసభ్యంగా తిట్టాడు. బాలిక నాన్నమ్మ, తల్లిదండ్రులు ఇంటికి చేరుకుని సురేష్‌ను నిలదీయగా వారిపై దాడిచేశాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని అతడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు విచారణ చేస్తుండగా రాత్రి 8 గంటల సమయంలో సురేష్ పోలీస్ స్టేషన్ నుంచి పారిపోయాడు. గతంలో అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్డులో జరిగిన హత్య కేసులో సురేష్ నిందితుడు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కంచరపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## మహిళా అభ్యున్నతిని కాంక్షిస్తూ ప్రపంచ యాత్ర




దయాళ్ భరద్వాజ్‌కు సత్కరిస్తున్న నిర్వాహకులు

బీచ్ రోడ్డు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : మహిళా లక్ష్య సాధనకు కృషి చేయాలని యూత్ హాస్టల్ ప్రతినిధి దయాళ్ భరద్వాజ్ పేర్కొన్నారు. ఆదివారం యూత్ హాస్టల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బీచ్ రోడ్డు వద్ద ఉన్న యూత్ హాస్టల్‌లో ఇష్టాగోష్ఠి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోని మహిళలు స్థితిగతుల గురించి తెలియజేసేందుకు ప్రపంచయాత్ర చేపట్టడం జరిగిందని తెలిపారు. ఏడు ఖండాల్లో 195 దేశాల మీదుగా సుమారు 12 ఏళ్ల పాటు తన యాత్ర కొనసాగుతుందని తెలిపారు. 2025, మార్చి 8న గుజరాత్‌లోని బరోడాలో తన యాత్ర ప్రారంభమైందన్నారు. రాష్ట్రంలో 350 మంది మహిళలతో మాట్లాడినట్టు తెలిపారు. విశాఖ జిల్లా చైర్మన్ ఇబ్రహీం మాట్లాడుతూ మహిళల కోసం ప్రపంచ యాత్ర చేయడం గొప్ప విషయమని చెప్పారు. కార్యక్రమంలో ఎన్.నాగేశ్వరరావుపాలూరు శేషమాంబ, జగపతి రాజు, వర్మరాజు, రజనీకాంత్‌పాల్గొన్నారు.

## కారు ఢీకొని వృద్ధుడి మృతి

ఆరిలోవ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : చినగదిలిలో గల నవ్య ఆస్పత్రి సమీపం వద్ద బీఆర్‌టీఎస్ రోడ్డు దాటుతుండగా హనుమంతవాక వైపు నుంచి సింహాచలం వైపు వెళుతున్న కారు వేగంగా వచ్చి బిజు పాండా (60) బలంగా ఢీకింది. దీంతో బిజు పండా అక్కడికక్కడే మృతి చెందాడు. ఆరిలోవ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కారు డ్రైవరును పోలీసులు అదుపులోకి తీసుకొని ఆరిలోవ పోలీసు స్టేషన్‌కు తరలించారు. బిజు పండా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నటు సీఐ మల్లేశ్వరరావు తెలిపారు.

# అప్పన్న ఉంగరం దొరికింది

- ఈఓ నుంచి భక్తుల వరకు అందరూ అనుమానితులే
- ఎట్టకేలకు ఏడో ముసుగులో దొరికిన అంగుళీయకం
- వైభవంగా స్వామివారి వినోదోత్సవం



రాజాలంకారంలో గోవిందరాజస్వామి.

సింహాచలం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): అప్పన్న స్వామి వార్షిక తిరుకల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం వినోదోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామి వారి ఆలయంలో భక్తుల ఆందోళనలు, ఆనందోత్సాహాల నడుమ ఈ వేడుక ఆసక్తికరంగా సాగింది. శనివారం రాత్రి స్వామివారు తన దేవేరులు, మంది మార్బలంతో కలిసి అడవికి వేటకు వెళ్లగా నీలుడు (తిరుమంగై ఆళ్వార్) అనే చోరుడు దారి కాచి ఆ మార్గం గుండా వెళ్లే వారిని దోచుకునే క్రమంలో స్వామివారి ఉంగరాన్ని కూడా అపహరిస్తాడు. ఈ ఉదంతాన్ని అర్చకులు కళ్లకు కట్టినట్లు అభినయించిన సంగతి తెలిసిందే. ఉంగరం దొరికిన ఘట్టాన్ని ఆదివారం వినోదోత్సవంగా నిర్వహించారు. ఉదయం 5 గంటలకు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపిన అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని స్వర్ణాభరణాలతో కాలుపై కాలు వేసుకుని ఠీవిగా కూర్చున్న రాజుగా అలంకరించి అతనిపై ఏడు ముసుగులు వేశారు. తొలుత ఆలయ బేడా మండపంలో తిరువీధి జరిపారు. ప్రధాన రాజగోపురం వద్ద స్వామివారిని ఉంచి పురోహితులు కరి సీతారామాచార్యులు దొంగలను వెతికే పనిలో పడ్డారు. ఈ క్రమంలో తొలుత ఆలయ దిగువ శ్రేణి ఉద్యోగులకు అధికారి కొత్వాల్ నాయకుడు లంక సూరిబాబు, వైదిక సిబ్బంది ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్‌ను, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఐవీ రమణాచార్యులు, అనుమానితులుగా పట్టుకుని విచారించి తొలి ముసుగు తొలగించారు. అదే క్రమంలో దేవస్థానం ఈఓ సుబ్బారావును సతీసమేతంగా, ఏఈఓ ఆనందకుమార్, పర్యవేక్షణాధికారి ప్రసాద్, కొందరు యువతను, విద్యార్థులను అనుమానితులుగా పట్టుకున్నారు. వారిని స్థానాచార్యులు రాజగోపాల్ న్యాయమూర్తిగా వ్యవహరించి విచారించారు. అనుమానితులుగా పట్టుబడిన వారిలో అనపర్తి సమీపంలోని మామిడాడ గ్రామానికి చెందిన గాయత్రి విద్యా పరిషత్‌లో తృతీయ సంవత్సరం ఎంబీబీఎస్ విద్యార్థినులు, కొత్తవలస ప్రాంతానికి చెందిన శ్రావణి, భార్గవి, యోగిత విషయం తెలియక కన్నీటి పర్యంతమయ్యారు. బీఎల్ పూర్తి చేసుకున్న విద్యార్థినులు ముగ్గురు, వడ్డాది ప్రాంతానికి చెందిన వ్యక్తి అధికారులను తీవ్రస్థాయిలో ప్రతిఘటించి వాగ్వివాదానికి దిగాడు. తమను అనుమానించడానికి గల సాక్ష్యాలు చూపాలంటూ వీరంగం సృష్టించారు. చివరకు అనుమానితులంతా ఇది ఉత్సవంలో భాగమని



పట్టుబడిన ఎంబీబీఎస్ విద్యార్థులు



దొరికిన ఉంగరాన్ని చూపుతున్న అర్చకులు, చిత్రంలో ఆలయ అధికారులు

తెలుసుకుని ఆనందం వ్యక్తం చేశారు. ఒక్కొక్క ముసుగు తొలగిస్తూ ఏడవ ముసుగును తొలగించగా, పోయిన ఉంగరం దొరికిందంటూ అర్చక స్వామి చూపడంతో అంతా హమ్మయ్య! అంటూ ఆనందించారు. అనంతరం సాధారణ సతీపతుల మధ్య జరిగే స్వల్ప వివాదాల మాదిరిగా స్వామి వారు, అమ్మవార్ల నడుమ సంవాద సేవ నిర్వహించారు. స్వామివారిని ఆలయ ధ్వజ స్తంభం వద్ద బయట పల్లకిలో, లోపల అమ్మవార్లను ఆలయ ఆస్థాన మండపంలో ఉంచి కీర్తనలు ఆలపించారు. సంవాదం అనంతరం పూల బంతులు విసురుకునే వేడుకలో పలువురు భక్తులు ఇరువర్గాలుగా అమ్మవార్లు, అయ్యవారి తరఫున పాల్గొన్నారు. స్వామివారిని అమ్మవార్లను బేడా మండపంలో ప్రదక్షిణలు జరిపారు. ఉత్సవం అనంతరం ఆలయంలో మహాసంప్రోక్షణ చేసి, బాలభోగం, రాజభోగం నివేదనలు చేశారు. భక్తులకు మధ్యాహ్నం 11.30 నుంచి 2.30 వరకు దర్శనాలు నిలుపుదల చేశారు.

## నేడు పీజీఆర్ఎస్ రద్దు

విశాఖపట్నం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా సెలవు కావడంతో సోమవారం జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్టు పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వచ్చే సోమవారం ప్రజల నుంచి యథావిధిగా ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. జీవీఎంసీలో జరిగే పీజీఆర్ఎస్‌ను కూడా రద్దు చేస్తున్నట్టు జీవీఎంసీ అదనపు కమిషనర్ రమణమూర్తి చెప్పారు.

### నేడు అంబేడ్కర్ జయంతి వేడుకలు

విశాఖపట్నం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోనూ సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్టు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎల్ఐసీ భవన కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించాక ఫుడ్‌కోర్టు సమీపంలో బహిరంగ సమావేశం ఉంటుందన్నారు. ఈ సమావేశానికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఇతర అధికారులు హాజరుకానున్నట్టు చెప్పారు.

## 'పదవీ విరమణ వయసు నిర్ణయం సరైనది కాదు'

విశాఖపట్నం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : నాగార్జున విశ్వవిద్యాలయంలో కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ల పదవీ విరమణ వయసుపై యూనివర్సిటీ యాజమాన్యం విడుదల చేసిన ఉత్తర్వులు సరైనవి కాదని ఏపీ ఫెడరేషన్ ఆఫ్ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (కాంట్రాక్ట్) రాష్ట్ర అధ్యక్షుడు కోడి అర్జునుడు అన్నారు. నాగార్జున వర్సిటీలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను 60 ఏళ్లకే పదవీ విరమణ చేయాలంటూ ఆదేశాలు ఇవ్వడంపై అభ్యంతరం వ్యక్తం చేసిన అసోసియేషన్ సభ్యులు, దీనిపై ఆదివారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీలు గాదె శ్రీనివాసులునాయుడు, వేపాడ చిరంజీవిరావు తదితరులను కలిసి వినతి పత్రాలు ఇచ్చారు. 25 ఏళ్లుగా తక్కువ వేతనాలతో వర్సిటీల్లో పనిచేస్తున్న ఉద్యోగులను ఇబ్బందులు పెట్టకుండా చూడాలన్నారు. వర్సిటీలో పనిచేసే వారి పదవీ విరమణ వయసు 62 నుంచి 65 ఏళ్లకు పెంచారని, కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసే వారికి కూడా వర్తింపజేయాలని కోరారు.

## సత్ప్రవర్తనతో మెలగండి

సీతమ్మధార, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని ద్వారకానగర్, నాలుగో పట్టణ సీఐలు రమణ, ఏ.సత్యనారాయణ హెచ్చరించారు. ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐలు మాట్లాడుతూ ఎటువంటి చట్టవ్యతిరేక పనులకు పాల్పడరాదని సూచించారు. సమాజంలో మంచి మనుషులుగా జీవించాలని హితవు పలికారు.

# రాజ్యాంగ పరిరక్షణకు ఐక్యంగా పోరాడాలి

**సినీనటుడు ఆర్.నారాయణమూర్తి**

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణకు ఐక్యంగా పోరాడాలని సినీనటుడు ఆర్.నారాయణమూర్తి పిలుపునిచ్చారు. ఆదివారం కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం, ప్రజానాట్యమండలి విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డా.బి.ఆర్.అంబేడ్కర్ 134వ జయంతి సందర్భంగా డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో రాజ్యాంగ పరిరక్షణ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై అంబేడ్కర్, జ్యోతిరావుపూలే, హష్మీ, బాబు జగ్జీవన్‌రామ్‌ల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు బలహీనవర్గాల తరపున పోరాడే గొప్ప వ్యక్తుల నుంచి పోరాటస్ఫూర్తిని అందిపుచ్చుకోవాలని నారాయణమూర్తి అన్నారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు లోకనాథం మాట్లాడుతూ దళితులు, మైనార్టీలు. కవులు, కళాకారులపై కేంద్రం దాడులు చేయిస్తోందన్నారు. కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్రా మాల్యాద్రి, పీఎన్ఎం జిల్లా అధ్యక్షుడు జి.రమణ, జిల్లా కార్యదర్శి టి.చిరంజీవి తదితరులు మాట్లాడారు. ఈ సభలో పీఎన్ఎం జిల్లా కార్యదర్శి ఎం.చంటి, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు. తొలుత నిర్వహించిన ర్యాలీలో రాజ్యాంగ పరిరక్షణ నాటిక..బాలబాలికల నృత్య ప్రదర్శనలు అలరించాయి.



ర్యాలీలో పాల్గొన్న ఆర్.నారాయణమూర్తి, ఇతర సభ్యులు

# ఉచిత వైద్య శిబిరాలకు స్పందన

మురళీనగర్/అక్కయ్యపాలెం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 50వ వార్డు మురళీనగర్ సెక్టార్-4లో ఆదివారం వార్వా, నివాస సంఘాల అధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య సేవల శిబిరానికి విశేష సంఖ్యలో జనం విచ్చేశారు. సాధారణ రుగ్మతల నుంచి నేత్ర, దంత పరీక్షలు, స్త్రీల క్యాన్సర్ వ్యాధులకు మెడికవర్ వైద్యుల సాయంతో శిబిరం నిర్వహించారు. మురళీనగర్ సెక్టర్-4లోని ప్రశాంతి స్పిరిట్యువల్ పార్క్ వేదికగా జరిగిన కార్యక్రమంలో ఎండలోనూ పలు ప్రాంతాల ప్రజలు చేరుకున్నారు. వైద్య పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు పొందారు. అక్కయ్యపాలెం సచివాలయం సమీపంలోని మద్రస సల్మాన్ పార్సీ ఆవాజ్ మైనార్టీ డెవలప్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ అబ్దుల్ రెహ్మాన్ మెమోరియల్ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది వచ్చి వివిధ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. వైద్యులు సదాఫ్ ఖనాం, బిలాల్ రెహ్మాన్, భార్గవ్, మద్రస సల్మాన్ పార్సీ లిల్లనాత్ అధ్యక్షుడు అబ్దుల్ రెహ్మాన్, ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు మొహ్మద్ అయూబ్, కార్యదర్శి అశ్రఫ్, అబ్దుల్ మునీర్, ముషహద్ తదితరులు పాల్గొన్నారు.





అక్కయ్యపాలెంలో వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

### నీలమ్మ వేపచెట్టు వద్ద నేడు రక్తదాన శిబిరం

అల్లిపురం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం జీవీఎంసీ 33వ వార్డులోని నీలమ్మ వేప చెట్టు వద్ద జీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు బి.గోపీకృష్ణ, ఆకుల రాజు తెలిపారు. యువత రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని కోరారు.

## ఉత్సాహంగా ఏపీ స్పోర్ట్స్ హాస్టలర్స్ సమ్మేళనం

విశాఖపట్నం స్పోర్ట్స్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని స్పోర్ట్స్ హాస్టలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రీయూనియన్ ఆదివారం బీచ్‌రోడ్డులో జరిగింది. వివిధ స్పోర్ట్స్ హాస్టళ్లలో 1980 నుంచి 2003 వరకు శిక్షణ పొంది వివిధ క్రీడాంశాలలో అంతర్జాతీయ, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించడమే కాకుండా స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు పొందినవారు, వివిధ రంగాల్లో ఉన్నత స్థాయిలో ఉన్న మాజీ క్రీడాకారులు విచ్చేసి గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి అంతర్జాతీయ మాజీ వాలీబాలర్, ఎమ్మెల్యే గణబాబు ముఖ్య అతిథిగా హాజరై తన క్రీడా అనుభవాలను గుర్తు చేసుకున్నారు. క్రీడా రంగంలో, ప్రభుత్వ క్రీడా విధానంలో వచ్చిన మార్పులు, సాంకేతికత, ఇతర అంశాలను ఆయన విశ్లేషించారు. ఈ సందర్భంగా సీనియర్ కోచ్ ఖాసీంతోపాటు డాక్టరేట్ సాధించిన క్రీడాకారులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష కార్యదర్శులు వెంకటేశ్వరరెడ్డి, రామిరెడ్డి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఎఫ్ఆర్ఎస్‌కు మస్కా

... 5వ పేజీ తరువాయి

డాక్టర్ కోటకల అనూష, చినవాల్తేరు పట్టణ ఆరోగ్య కేంద్రంలో పనిచేసే డాక్టర్ సాయి మోహిని ఉన్నారు.

వీరితోపాటు పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో కొందరు సిబ్బంది ముఖ ఆధారిత హాజరులో మోసానికి పాల్పడినట్టు ప్రభుత్వం గుర్తించింది. వీరిలో నగర పరిధి అంబేడ్కర్ కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రంలో పనిచేసే ఎస్‌వీఎల్ ప్రవీణ, మధురవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసే పసుపుల దీపిక, కొమ్మాది పట్టణ ఆరోగ్య కేంద్రంలో పనిచేసే గోసాల సాల్మన్‌రాజు, ఎంఎస్ఆర్ లేఅవుట్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో పనిచేసే డి.సాహిత్య, ఆర్పీపేట పట్టణ ఆరోగ్య కేంద్రంలో పనిచేసే మాట్టాశశి ప్రియాంక, రామ్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో పనిచేసే ఉయ్యాల కార్తీక్ ఉన్నట్టు గుర్తించింది. ఈ జాబితాను జిల్లా ఆరోగ్యశాఖ అధికారులకు పంపింది. దీంతో వీరిపై శాఖాపరమైన చర్యలు తీసుకునేందుకు యంత్రాంగం సిద్ధమవుతోంది. తొలుత వీరికి షోకాజ్ నోటీసులు జారీ చేసి, వివరణ తీసుకోవాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందినట్టు తెలిసింది. అనంతరం చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. ఎఫ్ఆర్ఎస్‌ను ఎలా ట్యాంపరింగ్ చేశారు, ఎందుకు చేశారన్న దానిపై వివరణ తీసుకుంటామన్నారు.

### రాష్ట్ర స్థాయిలో మానిటరింగ్

ప్రభుత్వశాఖల్లో అమలుచేస్తున్న ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని రాష్ట్రస్థాయి నుంచే మానిటరింగ్ చేస్తున్నారు. అక్కడి నుంచే పర్యవేక్షిస్తున్న అధికారులు ఉద్యోగుల సమయ పాలనను అంచనా వేస్తున్నారు. గత కొన్నాళ్లుగా భిన్నమైన పద్ధతులను అనుసరిస్తూ హాజరు వేస్తున్న సిబ్బందిని గుర్తించిన ప్రభుత్వం, జాబితాను జిల్లా యంత్రాంగానికి పంపింది. అన్ని శాఖల్లోనూ పూర్తిస్థాయిలో ఎఫ్ఆర్ఎస్‌ను పటిష్ఠంగా అమలు చేయడంతో ఉద్యోగుల పనితీరును మెరుగు పరచవచ్చనే భావనలో ప్రభుత్వం ఉంది.

# సేవా కార్యక్రమాలతో ప్రజలకు చేయూత





అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ విశాఖపట్నం డిస్ట్రిక్ట్ 105 గవర్నర్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న అట్లూరి ఉషారాణి

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు చేయూత అందించవచ్చని అలయన్స్ అంతర్జాతీయ అధ్యక్షుడు రాజ్‌కుమార్ సక్సేనా అన్నారు. ఆదివారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలోని అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ విశాఖపట్నం డిస్ట్రిక్ట్ 105 ఎన్నికలు నిర్వహించారు. వ్యవస్థాపకుడు బి.తిరుపతిరాజు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. గవర్నర్‌గా అట్లూరి ఉషారాణితో ప్రమాణ స్వీకారం చేయించారు. రాజ్‌కుమార్ సక్సేనా ముఖ్య అతిథిగా మాట్లాడుతూ ప్రతి సభ్యుడు సేవకు స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. బి.తిరుపతిరాజు మాట్లాడుతూ స్వదేశీ సేవా సంస్థగా గుర్తింపు పొందిన అలయన్స్ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలని కోరారు. ప్రమాణ స్వీకారం అనంతరం గవర్నర్ అట్లూరి ఉషారాణి మాట్లాడుతూ నిస్వార్థంగా సేవ చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. వీడీజీ 2 సీహెచ్ కాశీవిశ్వనాథన్, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ కార్యదర్శి కె.శ్రీనివాస్, కోశాధికారి సీహెచ్.వందన, పీఆర్‌ఓ జె.అనురాధ , నగరానికి చెందిన వివిధ అలయన్స్ శాఖల సభ్యులు పాల్గొన్నారు. 2024-25లో జిల్లాస్థాయిలో మంచి సేవా కార్యక్రమాలు నిర్వహించిన వివిధ శాఖల కార్యవర్గ సభ్యులకు అవార్డులు అందజేశారు.

# నాడీ వ్యవస్థకు వ్యాయామమే కీలకం





పార్కిన్‌సన్ వ్యాధిపై అవగాహన ర్యాలీ చేపడుతున్న నిర్వాహకులు

మాధవధార, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): శారీరక, మానసిక వ్యాయామం నాడీ వ్యవస్థ పనితీరుకు దివ్య ఔషధంగా పనిచేస్తాయని ప్రముఖ న్యూరాలజిస్ట్ కె.వెంకటేశ్వరులు సూచించారు. ఆదివారం మురళీనగర్ వాకర్స్ హెల్త్ క్లబ్ 20వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన పార్కిన్‌సన్ వ్యాధి నివారణ మార్గాలు, అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మనిషి వణుకుడు జబ్బుకు గురవడాన్ని పార్కిన్‌సన్‌గా పరిగణిస్తామని పేర్కొన్న ఆయన, నాడీ కణాలు మెదడును దెబ్బతీయడం ద్వారా ఈ వ్యాధి వస్తుందని తెలిపారు. కండరాలు బిగుసుకుపోవడం, వణుకు రావడం వల్ల సాధారణ రోజువారీ పనులను కూడా ఈ వ్యాధిగ్రస్థులు నెమ్మదిగా చేస్తారని అన్నారు. వారి మాటల్ని, చేతి రాతల్ని కూడా ఈ వ్యాధి దెబ్బతీస్తుందన్నారు. వాకర్స్ హెల్త్ క్లబ్ ఇలాంటి వ్యాధుల నిర్మూలన దిశగా స్పందించడం మంచి పరిణామమన్నారు. క్లబ్ అధ్యక్షుడు సి.హెచ్.శ్రీనివాసరాజు సేవా కార్యక్రమాల్ని వివరించారు. అనంతరం హరిత పార్కు నుంచి అవగాహన ర్యాలీ చేపట్టారు.

# పూర్వ విద్యార్థుల ఆనంద హేల



ఉపాధ్యాయులతో కలిసి పూర్వవిద్యారుల బృంద చిత్రం

సీతమ్మధార ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఆప్యాయ పలకరింపులతో పూర్వ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా జరిగాయి. గురుద్వారా దరి వసంతబాల విద్యోదయ హైస్కూల్ 1999-2000 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాల సమీపంలో ఉన్న వెన్నెల ఫంక్షన్ హాల్‌లో పాతికేళ్ల తరువాత కలుసుకుని ఆనందంగా గడిపారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ చదువుకున్న రోజుల్లో అనుభూతులను గుర్తుచేసుకొని సంతోష సాగరంలో ఓలలాడారు. వసంతబాల స్కూల్ టీచర్స్ ఉషారాణి, ఉషాకుమారి, కమలాకర్, ఉమాదేవి, సుబ్బలక్ష్మీ రమణ, అటెండర్ ముత్యాలు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులతో ఆనందంగా వేడుకలు జరుపుకొన్నారు. ఈ కార్యక్రమానికి లీలామాధవి, వనిత, యు.శ్రీనివాస్, అచ్యుత్, రామకృష్ణ, పి.సతీష్, హరి, పద్మలు పూర్వవిద్యార్థుల కలయిక కోసం ఎంతో కృషి చేశారు.

# పెను విషాదం

... 5వ పేజీ తరువాయి

వెల్లువెత్తుతున్నాయి. కైలాసపట్నం శివారున ఉన్న బాణసంచా కేంద్రానికి 2026 వరకు అనుమతులున్నాయని అధికారులు చెబుతున్నా, అగ్నిమాపక శాఖ నుంచి 2024 తరువాత రెన్యువల్ కోసం నిరభ్యంతర పత్రం (ఎన్ఓసీ) పొందలేదని తెలుస్తోంది. ప్రమాదకరమైన పేలుడు సామగ్రి తయారుచేసే ఈ కేంద్రంలో పరిశ్రమల శాఖ నిబంధనల ప్రకారం కార్మికులకు తగిన రక్షణ చర్యలు లేవని అక్కడి పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి. భారీగా పేలుడు పదార్థాలు నిల్వ చేసి, సామగ్రి తయారు చేస్తున్నా కనీసం బోర్డు కూడా ఏర్పాటుచేయలేదు. ఈ కేంద్రంలో ఫైర్ ఎక్విప్‌మెంట్ ఉందా, కార్మికులకు మందుగుండు సామగ్రి తయారీపై శిక్షణ ఇచ్చారా..? ముడి పదార్థాల నిల్వలు సురక్షితంగా ఉన్నాయా.. అనే ప్రశ్నలకు జవాబు దొరకడం లేదు. ప్రమాదం జరిగిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు కూడా బాణసంచా కేంద్రానికి అనుమతులున్నాయా లేదా అనేది స్పష్టం చేయలేకపోతున్నారు.

### మొక్కుబడి తనిఖీలు

వాస్తవానికి బాణసంచా కేంద్రాలను మండల రెవెన్యూ అధికారి సందర్శించి, ఇచ్చిన నివేదిక మేరకు ఆర్డీఓ స్థాయి అధికారి అనుమతులు జారీచేస్తారు. దీంతోపాటు పరిశ్రమలు, పర్యావరణ, అగ్నిమాపక శాఖలు ఏటా తనిఖీ చేసిన తరువాత మాత్రమే నిరభ్యంతర పత్రాలు ఇవ్వాలి. కాగా ఎలాంటి తనిఖీ చేయకుండానే నివేదికలు సమర్పించి మమ అనిపిస్తున్నారనే విమర్శలున్నాయి. ప్రమాదం సంభవించిన గంటల తరువాత జిల్లా యంత్రాంగం ఘటనా స్థలానికి చేరుకుంది. అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్‌సిన్హా, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి వెంకటరమణ తదితరులు ప్రమాద స్థలిని పరిశీలించారు.

### కనిపించని పర్యవేక్షణ

జిల్లాలోని బాణసంచా తయారీకేంద్రాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారుల పర్యవేక్షణ కనిపించడం లేదు. జిల్లా అగ్నిమాపక శాఖ అధికారిక రికార్డుల ప్రకారం కోటవురట్ల మండలం కైలాసపట్నం, ఎండపల్లి, నర్సీపట్నం మండలం వేములపూడి, మాకవరపాలెం మండలం భీమబోయినపాలెం, చోడవరం మండలం ఎంకేపాలెం, అచ్యుతాపురంలో మాత్రమే బాణసంచా తయారీ కేంద్రాలకు అనుమతులున్నాయి. అయితే అనధికారికంగా ప్రతి మండలంలో బాణసంచా తయారీ జరుగుతోంది.

### ఉమ్మడి జిల్లాలోనూ సంఘటనలు

ఉమ్మడి విశాఖ జిల్లాలో బాణసంచా తయారీ కేంద్రాల్లో అనేక ప్రమాదాలు సంభవించాయి. 2011లో మొగలిపురంలో అనధికార బాణసంచా తయారీ కేంద్రంలో సంభవించిన పేలుడులో ఇద్దరు మృతి చెందారు. 2019లో సబ్బవరం మండలం గుల్లిపల్లిలో అనధికార బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన ప్రమాదంలో ఆరుగురు మృత్యువాతపడ్డారు. జిల్లా పునర్విభజన తరువాత 2022 జూన్‌లో సబ్బవరం మండలం ఆరిపాకలో అనధికార బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు సంభవించి నలుగురు మృతిచెందగా, ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. అనుమతులున్న వాటితో పాటు, అనధికార బాణసంచా తయారీ కేంద్రాల్లో భద్రతా చర్యలు శూన్యమనేది బహిరంగ రహస్యం. వీటిలో ప్రమాదాలు సంభవిస్తున్నా బయటకు పొక్కనీయడం లేదు.

### ప్రతి కుటుంబానిదీ ఓ దీనగాథ

కోటవురట్ల/ నర్సీపట్నం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కైలాసపట్నంలోని బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడులో మృతిచెందిన వారి కుటుంబాల్లో ఒక్కొక్కరిది ఒక్కో గాథ. ప్రమాదంలో మృతిచెందిన దాడి రామలక్ష్మి ఒంటరిగా జీవిస్తున్నది. ఆరేళ్ల క్రితం భర్త చనిపోయాడు. కుమార్తె ధనలక్ష్మికి గతంలోనే వివాహమైంది. ఆమె ఎలమంచిలి మండలం జంపపాలెంలో వుంటున్నది. మరో మృతుడు గంపెన వేణుకి భార్య భవాని, కూతురు, కొడుకు ఉన్నారు. గుర్తు పట్టలేనంతగా వేణు మృతదేహం కాలిపోయింది. మొదట్లో చేనేత కార్మికుడిగా పని చేసేవాడు. ఆ వృత్తి కలిసి రాకపోవడంతో బాణసంచా తయారీ కేంద్రంలో కూలీగా వెళుతూ, ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. కైలాసపట్నం గ్రామానికి చెందిన పురం పాప భర్త చనిపోయి 10 సంవత్సరాలు అవుతున్నది. ఈమెకు ఇద్దరు పిల్లలు వున్నారు. బాణసంచా ప్రమాదంలో ఆమె చనిపోవడంతో పిల్లలు అనాథలయ్యారు. కైలాసపట్నం గ్రామానికి చెందిన సంగరాతి గోవిందకు భార్య, ఇద్దరు పిల్లలు పిల్లలు వున్నారు. ఆయన మృతితో కుటుంబం వీధిన పడింది.

# ఆక్రమణలకు మార్కింగ్!

... 5వ పేజీ తరువాయి

సీపీని సంప్రతించి ట్రాఫిక్‌కు ఇబ్బందిలేకుండా దుకాణాల ఏర్పాటుకు అనుమతించాలని కోరినట్టు తెలిసింది. దీనికి సీపీ ససేమిరా అనడంతో జోనల్ కమిషనర్, కిందిస్థాయి పోలీసు అధికారులకు ఫోన్‌చేసి దుకాణాల ఏర్పాటుకు మార్కింగ్ చేయాలని, లేదంటే దగ్గరుండి దుకాణాలు పెట్టిస్తామని బెదిరించినట్టు ప్రచారం జరుగుతోంది. దీంతో పోలీసులు పూర్ణామార్కెట్ రోడ్డులో పార్కింగ్ వెంబడి దుకాణాలు పెట్టుకునేందుకు వీలుగా మార్కింగ్ చేశారు. ఈ నేపథ్యంలో మార్కెట్‌లోని వ్యాపారులతోపాటు స్థానిక కార్పొరేటర్ అడ్డుకున్నారు. మార్కెట్‌లోపల ఉన్న వందలాది వ్యాపారులకు ఇబ్బందులు ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆశీలు కాంట్రాక్టరు రోడ్డుపై దుకాణాలు పెట్టించి, రోజుకు రూ.300 చొప్పున వసూలు చేసుకోవాలనే ప్రజాప్రతినిధులను తప్పుదారిపట్టిస్తున్నారని ఆరోపించారు. రోడ్డుపై దుకాణాలు పెట్టాలనుకునే వారికి మార్కెట్‌లో దుకాణాలున్నాయని, అక్కడ వద్దనుకుంటే జీవీఎంసీకి అప్పగించాలన్నారు. వేరొకరికి కేటాయిస్తారని చెప్పడంతో అధికారులు వెనుదిరిగారు. దీనిపై సీపీతోపాటు జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ హరేంధిరప్రసాద్ దృష్టిసారించాలని, రోడ్డుపై ఆక్రమణలకు అవకాశం లేకుండా ఆదేశాలివ్వాలని కోరుతున్నారు.

### వసూళ్లకు వ్యూహం

తొలగించిన దుకాణాలను తిరిగి పెట్టించడానికి చాలా ఖర్చుచేశామని, మార్కెట్‌లో దందా చేస్తున్న ఓ దళారీ వసూళ్లకు రంగం సిద్ధం చేసినట్టు తెలిసింది. పూర్ణామార్కెట్ ప్రధాన రహదారిలో దుకాణాలను పోలీసులు రెండు నెలల కిందట తొలగించగా, ఆశీలు వసూలు కాంట్రాక్ట్ దక్కించుకున్న వ్యక్తి ఈనెల ఒకటిన తిరిగి పెట్టించారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో మరోసారి కథనం ప్రచురితంకావడంతో రెండో తేదీన పోలీసులు దుకాణాలను తొలగించారు. ఈ క్రమంలో కూటమి నేతల పేరుతో జీవీఎంసీ, పోలీసుల వద్ద రుబాబు చేసి, దుకాణాలు పెట్టించేందుకు మార్కింగ్ చేయించారు. ఈ మేరకు ఆదివారం 130 మంది వ్యాపారులతో రామకృష్ణ రైతుబజార్‌లో సమావేశం నిర్వహించారు. సోమవారం నుంచి మార్కెట్ రోడ్డులో దుకాణాలను పెట్టిస్తానని, జీవీఎంసీ, పోలీసు అధికారులకు భారీగా ముట్టజెప్పాల్సి ఉంటుందని, ఆ వివరాలను చెబితే లీకై, 'ఆంధ్రజ్యోతి'లో వార్తలు వచ్చేస్తున్నాయి కాబట్టి, పదిరోజుల తర్వాత చెబుతానన్నాడని సమాచారం. ఇదంతా పోలీసులు, జీవీఎంసీ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని వ్యాపారులు ఆరోపిస్తున్నారు.

# ఆరు గంటలు ఉత్కంఠ!

... 5వ పేజీ తరువాయి

పిల్లలిద్దరూ సెల్లార్ పక్కన ఖాళీ స్థలంలోని ఇసుకలో ఆడుకుంటున్నారు. కేశవరావు సమీపంలో అపార్టుమెంట్ వాచ్‌మన్‌తో మాట్లాడుతున్నాడు. చీకటి పడడంతో పిల్లలను తీసుకువెళ్లేందుకు రాగా, రుగేశ్వరిశ్రీ కనిపించలేదు. పెద్దపాపను ఆరాతీయగా తెలియదని చెప్పడంతో ఆందోళన చెందారు. బంధువులు, స్నేహితులతో కలిసి వెతికినా ఫలితం దక్కలేదు. దీంతో డయల్ 112కు కాల్ చేయడంతో పెందుర్తి సీఐ కేవీ సతీశ్‌కుమార్, సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకున్నారు. అపార్ట్‌మెంట్ సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించినా ఆధారాలు లభించలేదు. దీంతో కిడ్నాప్ కోణంలో విచారణ చేపట్టారు. అపార్ట్‌మెంట్‌కు కొద్దిదూరంలో చెరువు ఉండడంతో డ్రోన్‌లను రంగంలోకి దింపారు.

### వీడిన ఉత్కంఠ..

డ్రోన్ కెమెరాలో పసిపాప జాడ కనిపించింది. లోకేషన్ అంతుచిక్కలేదు. దీంతో పోలీసులు టార్చిలైట్లు, ద్విచక్రవాహనాల వెలుగులో జల్లెడ పట్టారు. ఎట్టకేలకు చెరువు సమీపంలోని మట్టిలో పాపను గుర్తించారు. క్షేమంగా తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. రాత్రి ఏడు గంటలకు అదృశ్యమైన పాప ఆచూకీ అర్ధరాత్రి ఒంటి గంటకు లభించడంతో ఆరు గంటల ఉత్కంఠకు తెరపడింది. ఆడుకుంటూ చిన్నారి చెరువు వద్దకు వెళ్లిపోయిందని, మట్టిలో కూరుకుపోవడంతో బయటకు రాలేకపోయిందని సీఐ తెలిపారు.




చిన్నారిని తండ్రికి అప్పగిస్తున్న సీఐ

### కాంట్రాక్టు కార్మికుల నిరవధిక సమ్మె నేపథ్యంలో..

# ఉక్కు యాజమాన్యం అప్రమత్తం

- 30 వరకు ఉద్యోగులకు సెలవులు రద్దు
- రేపటి నుంచి అధికారులకు 12 గంటల చొప్పున విధులు
- కీలక నిర్ణయాలు వెల్లడి
- సమ్మె విరమించుకోవాలని కోరిన యాజమాన్యం
- వెనక్కి తగ్గేది లేదంటున్న కార్మికులు



ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికుల తొలగింపునకు నిరసనగా ఈ నెల 16 నుంచి కాంట్రాక్టు కార్మికులు చేపట్టనున్న నిరవధిక సమ్మె చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో ఉక్కు యాజమన్యాం అప్రమత్తమైంది. స్టీల్ ప్లాంట్‌లో సుమారు 13 వేల మంది కాంట్రాక్టు కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో ఉక్కు యాజమాన్యం అధికారికంగా 1503 మందిని తొలగించిన విషయం తెలిసిందే. అలాగే ఆయా కాంట్రాక్టు సంస్థలకు టెండర్లు పూర్తికావడం, మళ్లీ ఆ టెండర్లను పిలవకపోవటంతో ఆయా కాంట్రాక్టర్ల వద్ద పని చేస్తున్న సుమారు వెయ్యి మంది వరకు విధులకు దూరమయ్యారు. కాంట్రాక్టు కార్మికులను తొలగించరాదని ఉక్కు యాజమాన్యానికి గతంలో సమ్మె నోటీసు ఇవ్వటం, ఆ సమయంలో ఆర్‌ఎల్‌సీ సమక్షంలో చర్చలు జరగటం జరిగింది. అయితే చర్చల్లో ఎటువంటి పురోగతి లేకుండా పోయింది. ఈ క్రమంలో ఒక్కరోజు సమ్మెకు వెళ్లారు. అయినప్పటికి యాజమాన్యం వైఖరిలో మార్పు రాకపోవటంతో అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు సమావేశమై నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చారు.

**ఉద్యోగులకు సెలవులు రద్దు.. 12 గంటల డ్యూటీలు**

కాంట్రాక్టు కార్మికులు నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఉద్యోగులకు ఈ నెల 15 నుంచి 30వ తేదీ వరకు ఉక్కు యాజమాన్యం సెలవులు రద్దు చేసింది. అలాగే అధికారులు మంగళవారం నుంచి 12 గంటల చొప్పున విధులు నిర్వహించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఉదయం 8నుంచి రాత్రి 8 గంటల వరకు ఒక షిఫ్ట్, మళ్లీ రాత్రి 8నుంచి ఉదయం 8 గంటల వరకు మరో షిఫ్ట్ చొప్పున విధులు నిర్వహించాలని ఉక్కు యాజమాన్యం పేర్కొంది. ముఖ్యమైన విభాగాల్లో అధికారులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

మరోవైపు.. సమ్మె విరమించుకోవాలని ఉక్కు కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులను అధికారులు కోరారు. అయితే తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, ఇకపై కాంట్రాక్టు కార్మికులను తొలగించమని స్పష్టమైన హామీ ఇస్తేనే సమ్మె విరమిస్తామని కార్మికులు తెగేసి చెప్పారు. యాజమాన్యం దిగొచ్చే వరకూ పోరాటాలు తప్పవని కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు స్పష్టం చేశారు.



బొర్రమాంబ అమ్మవారు

## నేటి నుంచి బొర్రమాంబ జాతర

అగనంపూడి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి, ఉక్కు నిర్వాసిత గ్రామాల ఆరాధ్యదైవం, కొర్కెలు తీర్చే కల్పవల్లిగా జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన బొర్రమాంబ అమ్మవారి జాతరను రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి సోమవారం రాత్రి తొలేళ్ల మహోత్సవంలో భాగంగా మహిళలు కోటి దీపాల జాతరను నిర్వహించనున్నారు. అలాగే మంగళవారం అమ్మవారి అనుపోత్సవాన్నివైభవంగా జరిపేందుకు ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు చేపట్టారు. తెల్లవారు జాము 3 గంటల నుంచి అమ్మవారి దర్శనాలు ప్రారంభించనున్నట్టు ఉత్సవ కమిటీ చైర్మెన్ చిత్తా గణేశ్ తెలిపారు. సాయంత్రం బండ్ల వేషాలతో పాటు పలు సాంస్కృతిక, జానపద కార్యక్రమాలతో అనుపోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు.

## చలివేంద్రం ప్రారంభం

గాజువాక, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : సత్యసాయి సేవా సంస్థలు గాజువాక, బీహెచ్‌పీవీ శాఖల ఆధ్వర్యంలో పాత గాజువాక జంక్షన్‌లో ఆదివారం చలివేంద్రం ఏర్పాటు చేశాయి. జిల్లా సంస్థల అధ్యక్షుడు పీఆర్ ఎస్ఎన్ నాయుడు, జిల్లా సేవాదళ్ కో-ఆర్డినేటర్ ఆర్‌పి నాయుడు, సిటీ సమితి కన్వీనర్ సీతారామరాజులుప్రారంభించారు. రోజుకు 108 లీటర్ల పెరుగుతో సుమారుగా 720 లీటర్ల మజ్జిగ పంపిణీ చేయటం జరుగుతుందని ప్రతినిధులు తెలిపారు.

## 'అంబేడ్కర్ ఆశయసాధనకు ప్రధాని మోదీ చేస్తున్న కృషి అమోఘం'

గాజువాక, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో బలమైన శక్తిగా భారతదేశం ఉందని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశం అన్ని విధాలా ప్రగతిపథంలో పయనిస్తోందని మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు అన్నారు. ఆదివారం గాజువాక అంబేడ్కర్ విగ్రహాన్ని శుభ్రపరిచి, విగ్రహం వద్ద దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయసాధనకు ప్రధాని మోదీ చేస్తున్న కృషివిశేషమైందన్నారు. కార్యక్రమంలో గాజువాకబీజేపీ కన్వీనర్ కరణంరెడ్డినరసింగరావు, నేతలు దేముడు, బాటా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## స్టీల్‌ప్లాంటు కాంట్రాక్టు కార్మికుల సమ్మె పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : కాంట్రాక్టు కార్మికుల తొలగింపునకు నిరసనగా ఈ నెల 16 నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్టు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు పేర్కొన్నారు. గాజువాకలో ఆదివారం సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికుల విషయంలో స్టీల్‌ప్లాంటు యాజమాన్యం దుర్మార్గంగా వ్యవహరిస్తోందన్నారు. తొలి రెండు రోజులు గేట్ల వద్ద నిరసన, మూడో రోజు గాజువాకలో అర్ధనగ్న ప్రదర్శన, నాలుగ్గో రోజు చలో కలెక్టరేట్ కార్యక్రమాలు చేపట్టనున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు నమ్మి రమణ, మంత్రి రవి, కె.వంశీకృష్ణ, జి.శ్రీనివాసరావు, ఆనంద్, కోన రమణ పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

## పీ 4 సర్వేలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు భాగస్వాములు కావాలి : ఎమ్మెల్యే పల్లా

- గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

గాజువాక, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న పీ 4 సర్వేలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు భాగస్వామ్యులు కావాలని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. లయన్స్ క్లబ్ 44వ జిల్లా సమావేశం గాజువాక క్లబ్‌లో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు ప్రశంసనీయమని, ఈ సేవలను మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా 2025-26 సంవత్సరానికి లయన్స్‌క్లబ్ ఎన్నికలు నిర్వహించగా సెకెండ్ వైస్ డిస్ట్రిక్ గవర్నర్‌గా ఉన్న శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా గవర్నర్ ఎంవీబీఎస్ఎస్ ప్రసాద్, అధ్యక్షుడు కోటేశ్వరరావు, కోశాధికారి బలివాడ సత్యారావు, ప్రతినిధులు పాలిశెట్టి లక్ష్మణ్, అలపాటి సుబ్బారావు, చిక్కా సత్యనారాయణ, శేషప్రసాద్ పాల్గొన్నారు.

## నేడు పెంటమాంబ అనుపు ఉత్సవం



పెదగంట్యాడ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రాంత ప్రజల ఇలవేల్పుగా ప్రసిద్ధిగాంచిన శ్రీపెంటమాంబ అమ్మవారి అనుపు ఉత్సవాలు సోమవారం జరుగనున్నాయి. ఈ నెల 2 నుంచి ప్రారంభమైన పెంటమాంబ వార్షికోత్సవాలు అనుపు ఉత్సవంతో ముగియనున్నాయి. సోమవారం తెల్లవారు జాము రెండు గంటల నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, భక్తులకు దర్శనాలు జరుగనున్నాయి. ఉదయం 11 గంటలకు పూర్ణాహుతి, అనంతరం దీక్ష విరమణ చేపడతారు. సాయంత్రం 4 గంటల నుంచి అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తారు. పులి వేషాలు, కోయ డ్యాన్సులు, సాముగరిడీలు, తప్పెటగుళ్ళు, కోలాటాలు, నవదుర్గఅమ్మవార్ల కళారూపాల ప్రదర్శన, పూసల డ్యాన్స్, బుట్టబొమ్మల డ్యాన్స్, పౌరాణిక పద్యనాటకం, గరగనృత్యం వంటి సాంస్కృతిక కార్యక్రమాలలో అమ్మవారి ఊరేగింపు జరుగనుంది. రాత్రికి భక్త చింతామణి, రామాంజనేయ యుద్ధం, గయోపాఖ్యానం నాటకాలను వేర్వేరు స్టేజీలపై ప్రదర్శించనున్నారు. సినీ సంగీత విభావరి, భారీ బాణసంచా కాల్చడం అనుపులో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. అనుపు ఉత్సవ నిర్వాహణకు ఆలయ నిర్వాహక కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ సందర్భంగా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు న్యూపోర్టు పోలీసులు తెలిపారు.

## కణితి జడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థుల సమావేశం

**మూడున్నర దశాబ్దాల తర్వాత కలుసుకున్న పాతమిత్రులు**



సమావేశమైన 1989-90 బ్యాచ్ విద్యార్థులు

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : కణితి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 1989-90లో పదోతరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో సమావేశమయ్యారు. ఎక్కడెక్కడో వివిధ రంగాల్లో, వివిధ హోదాల్లో స్థిరపడిన వారంతా కలుసుకున్నారు. ఒకర్నొకరు ఆప్యాయంగా పలకరించుకుని కుశల ప్రశ్నలు వేసుకున్నారు. అప్పటి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు గరిమెళ్ల సాంబశివరావు, ఉపాధ్యాయులు కృష్ణారావు, ప్రకాష్, ఎస్.సరోజని, మహ్మద్ యూసఫ్, మోసెస్ తదితరులు హాజరయ్యారు. సరస్వతీదేవి విగ్రహానికి పూలమాలలు వేశారు. దివంగతులైన అధ్యాపకులకు నివాళులు అర్పించారు. అపూర్వ కలయిక నిర్వాహకులు గురుగొవింద్, జి.అంజనేయులు, కె.శ్రీనివాసరావు, ఎస్.త్రినాథ్, బొడ్డ సన్యాసిరావు పాల్గొన్నారు.

## సనాతన ధర్మాన్ని పరిరక్షించే బాధ్యత మనందరిది

**మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు**



మాట్లాడుతున్న మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు

గాజువాక, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) :సనాతన ధర్మాన్ని పరిరక్షించే బాధ్యత మనందరిపై ఉందని మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు పేర్కొన్నారు. గాజువాక లంకా మైదానంలో ఆదివారం హిందూ ధర్మ పరివార్ ఆధ్వర్యంలో 'మేలుకో హిందూ.. మేలుకో' నినాదంతో చేపట్టిన హిందూ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. హిందూ ధర్మం విశేషమైందన్నారు. రాష్ట్ర సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసనంద సరస్వతి, బాలా త్రిపురేంద్ర స్వామీలు మాట్లాడుతూ హిందూ ధర్మం విశేషమైందని, హిందూధర్మం అనేక దేశాల ప్రజలు ఆచరిస్తున్నారన్నారు. మన పూజా విధానంలో 'సర్వేజనా సుఖినోభవంతు' అనే నినాదం ఉందన్నారు. ఇటీవల జరిగిన మహాకుంభమేళా ద్వారా హిందువుల ఐక్యతను ప్రపంచానికి చాటి చెప్పామన్నారు. గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో పలువురు స్వామీజీలు, నాయకులు బాటా శ్రీను, దీనంకొండ కృష్ణంరాజు, బొండా యల్లాజీరావు, వెంకటరణ పాల్గొన్నారు.

## మే డే ఉత్సవాల సందర్భంగా విద్యార్థులకు పోటీలు

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మే డే ఉత్సవాల సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించనున్నట్టు జీవీఎంసీ 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారాం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25, 26 తేదీల్లో కృష్ణా మైదానంలో విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

## క్రీడాకారులకు అన్ని విధాలా ప్రోత్సాహం

**జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.హర్షవర్ధన్ ప్రసాద్**

గాజువాక, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు అన్నివిధాలా ప్రోత్సహించి, విశాఖ జిల్లా క్రీడాకారులకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తేవడమే ప్రధాన లక్ష్యమని విశాఖ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.హర్షవర్ధన్ ప్రసాద్ పేర్కొన్నారు. పంతులుగారి మేడ వద్ద అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం జరిగిన విశాఖ జిల్లాక్రీడాకారుల సంక్షేమ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచే క్రీడాకారులకు అండగా నిలిచి పూర్తి సహాయ, సహకారాలందిస్తామని హామీ ఇచ్చారు. ఎంఎస్ఎంఈ చైర్మన్ పి.శివశంకర్ మాట్లాడుతూ ప్రోత్సహిస్తే మరింత నైపుణ్యం సాధించి ఉన్నత శిఖరాలను అందుకోగలరని అన్నారు. ఏపీస్టేట్ ఒలింపిక్ సంఘం కార్యదర్శి కే.పీ.రావు మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి క్రీడాకారుల సమస్యలు తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు.

**జిల్లా కార్యవర్గ ఎన్నిక...**

ఈ సందర్భంగా జిల్లా ఒలింపిక్ అసోసియేషన్‌కు కార్యవర్గాన్ని ఏకగ్రీవం ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా టి.హర్షవర్ధన్ ప్రసాద్, కార్యదర్శిగా ఎన్.లలిత్‌కుమార్, ఉపాధ్యక్షుడుగా పి.గణపతిరావు మరో ముగ్గురు, జాయింట్ సెక్రటరీగా కె.నిషాంత్ మరో ఇద్దరు, కోశాధికారిగా సీహెచ్ కిశోర్‌మార్, చీఫ్‌పాట్రన్‌గా పి.శివశంకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సత్యనారాయణ ఎన్నికయ్యాఉ. ఈ ఎన్నికకు రిటర్నింగ్ ఆఫీసర్‌గా జె.పృథ్వీరాజ్, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్‌గా జేవీ కుమార్ వ్యవహరించారు.

### సినిమా గైడ్

- **గుడ్, బ్యాడ్, అగ్లీ :** శ్రీవెంకటేశ్వర, సంగం, నరసింహ (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం) అరుణ (పెదగంట్యాడ)
- **జాక్ :** జగదాంబ, శ్రీకన్య, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం),
- **రాబిన్‌హుడ్ :** శ్రీ లీలామహల్, గోకుల్,
- **మ్యాడ్ :** జగదాంబ, శరత్, కన్య (గాజువాక),
- **పెళ్ళికాని ప్రసాద్ :** శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య(గోపాలపట్నం), తాతా(తగరపువలస)
- **కోర్ట్ :** జగదాంబ, మినీ మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

### రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 20, టమాటా 17, వంకాయలు (తెలుపు) 18, వంకాయలు (నలుపు) 18, బెండ 30, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 34, బీరకాయలు 42, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 18, క్యాబేజి 12, క్యారెట్ 28 దొండకాయలు 22, బంగాళ దుంపలు 17, అరటి కాయ (పె)8, మునక్కాడలు (కిలో) 34, అల్లం (పాతది)48, బరబాటి 26, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 62, దోస కాయలు 26, వె ల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 52, కీరదోస 24, కాప్సికమ్ 46, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 28 చిలగడదుంపలు 36, కంద 64, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 38, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 32, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 50, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 48, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

| కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో) | |
|---|---|
| విశాఖపట్నం | 415 |
| విజయనగరం | 419 |
| శ్రీకాకుళం | 419 |

| చికెన్ ధరలు | |
|---|---|
| బ్యాగ్ | |
| రైతు ధర | 110 |
| లైవ్ ధర | 130 |
| విత్ స్కిన్ | 230 |
| స్కిన్‌లెస్ | 240 |

## 'ప్రభుత్వంపై వైసీసీ అసత్య ప్రచారం'



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతిష్ఠను దెబ్బతీయడమే లక్ష్యంగా వైసీపీ నేతలు అసత్య ఆరోపణలు చేస్తూ ప్రభుత్వంపై బురదజల్లుతున్నారని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు ధ్వజమెత్తారు. ఆయన నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ తిరుపతి గోశాలలో ఆవులు మృతి చెందాయంటూ టీటీడీ మాజీ చైర్మన్, వైసీపీ నేత భూమన కరుణాకరరెడ్డి చేసిన ఆరోపణల్ని ఖండించారు. గోవుల సంరక్షణకు టీటీడీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని, చంద్రబాబు పాలనలో తిరుపతి దేవస్థాన పవిత్రతకు, భక్తుల మనోభావాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చక్కగా నిర్వహణ జరుగుతుందని పేర్కొన్నారు. రాజకీయ లబ్ధికోసం తిరుపతి ప్రతిష్ఠను దిగజార్చే ఆరోపణల్ని వైసీపీ నేతలు మానుకోవాలని ఆయన హితవు పలికారు.

## షిప్‌యార్డు పైప్‌లైన్ లీక్ .. నీరు వృథా



రోడ్డుపై పారుతున్న తాగునీటిని బిందెలో పట్టుకుంటున్న వ్యక్తి

మల్కాపురం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మింది నుంచి షిప్‌యార్డుకు వెళ్లే ప్రధాన మంచినీటి పైపులైన్ లీకవడంతో తాగునీరు ఏరులై పారైంది. జీవీఎంసీ కొన్నేళ్లుగా షిప్‌యార్డుకు తాగునీటి అవసరాలు తీర్చడానికి మంచినీటిని సరఫరా చేస్తోంది. ఇటీవల కేబుల్ వేసేందుకు గోతులు తవ్వడంతో పైప్‌లైన్ దెబ్బతింది. అది ఇప్పుడు లీకై ఉంటుందని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సరిగ్గా ఈఎస్ఐ ఆస్పత్రి ప్రహరీకి అనుకొని ఉన్న పైప్‌లైన్ ఏ కారణంతో లీక్ అయ్యిందో తెలియదు కానీ లక్షలాది గ్యాలన్ల నీరు వృథాగా పోతోంది. కొంతమంది బిందెలు తీసుకొచ్చి రోడ్డుపై పారుతున్న ఈ నీటిని బిందెలలో పట్టుకొని ఇళ్లకు తీసుకొని వెళ్లారు. జీవీఎంసీ మంచినీటి సరఫరా సిబ్బంది ఈ లీకేజీని అరికట్టే పనిని చేసినప్పటికీ నీరు మాత్రం వృథాగా పోతోందని పలువురు పేర్కొంటున్నారు. లీకేజీ కారణంగా యారాడ రైతుల అరటి వ్యాపారానికి ఇబ్బందులు తలెత్తాయి. ప్రతి ఆదివారం యారాడకు చెందిన అనేక మంది రైతులు పెద్ద సంఖ్యలో అరటి గెలలు తీసుకొచ్చి ఇక్కడే పెట్టుకొని వ్యాపారం చేస్తుంటారు. పైపులైన్ లీకేజీ వల్ల వ్యాపారం దెబ్బతిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

## 60 మంది యువకుల రక్తదానం



రక్తపరీక్ష చేయించుకుంటున్న గండి బాబ్జీ

పెందుర్తి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రక్తదానంపై అపోహలు వీడాలని మాజీ ఎమ్మెల్యే గండిబాబ్జీ అన్నారు. సత్తివానిపాలెంలో ఆదివారం రేంజర్ ఫోర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని బాబ్జీ ప్రారంభించి మాట్లాడారు. రక్తదాతలు ప్రాణదాతలన్నారు. శిబిరంలో 60 మంది యువత స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదాతలకు బాబ్జీ ధ్రువీకరణపత్రాన్ని, జ్ఞాపికను అందజేశారు. అంతకుముందు బాబ్జీ వైద్యులతో బీపీ పరీక్ష చేయించుకున్నారు.

## అంబేడ్కర్ కృషితోనే దళితులకు చట్టసభల్లో అవకాశం: జూపూడి



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న జూపూడి ప్రభాకరరావు తదితరులు

పెందుర్తి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాలిమెరక జుత్తాడ ఎస్సీ కాలనీలో భీమ్‌రావ్ రాంజీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం 14 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో జూపూడి మాట్లాడుతూ దళితులు చట్టసభలో అడుగిడారంటే అంబేడ్కర్ కృషి కారణమన్నారు. రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, సర్పంచ్ బొడ్డు ప్రకాశ్, వైసీపీ నేత గండి రవికుమార్ సంఘ అధ్యక్షుడు ముప్పల వెంకటరమణ(శ్రీను), కార్యదర్శి ముప్పల రమణ, కాటపల్లి అప్పారావు, ముప్పల చినఅప్పారావు, ముప్పల రాంబాబు, ముప్పల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మట్టల ఆదివారం పండుగ



వేపగుంటలో ప్లకార్డులతో క్రైస్తవుల ర్యాలీ

మల్కాపురం/వేపగుంట/ఎన్.ఎ.డి. జంక్షన్/ ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవుల శ్రమదినాలలో భాగంగా ఆదివారం మల్కాపురం, వేపగుంట, ఎన్.ఎ.డి.జంక్షన్ తదితర ప్రాంతాల్లో మట్టల పండగను(మట్టల ఆదివారం) ఘనంగా నిర్వహించారు. సమాజ రక్షణకు వచ్చిన ప్రభువు..అందరి దేవుడు అంటూ నినాదాలు చేశారు. పలుచోట్ల పాస్టర్లు క్రీస్తు సందేశాలిచ్చారు. ఈస్టర్ పండగకు ముందు మట్టల ఆదివారం నిర్వహించడం ఆనవాయితీ. ఈస్టర్‌తో శ్రమదినాల కార్యక్రమం పూర్తవుతుంది. వేపగుంట ముత్యాలమ్మకాలనీలో పండుగను ఘనంగా నిర్వహించారు. ఈత కొమ్మలు పట్టుకొని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మట్టలను, క్రీస్తు బోధనలు రాసిన ప్లకార్డులు పట్టుకొని ర్యాలీగా వెళ్లారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ 40 దినాల ఉపవాస దీక్ష ముగుస్తున్న సందర్భంగా ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు రెవెరెండ్ ఫాదర్ సుందరరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డేనిష్, ప్రభు జకర్యా, సందీప్, అబ్రహం తదితరులు పాల్గొన్నారు. 90వ వార్డు పరిధిలోని సుసర్లకాలనీ దరి సేవియర్ లూథరన్ చర్చి సంఘం ఆధ్వర్యంలో పండుగను ఘనంగా నిర్వహించారు. యువకులు, విద్యార్థులు మట్టలకు రంగుల పూలు ధరించి పాటలు పాడుతూ ర్యాలీగా వెళ్లారు.